

నేడు పీసీసీ చీఫ్ షర్మిల రాక



విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అక్కయ్య పాలెంలోని మహారాణి పార్లర్ జంక్షన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి కోరారు.

తుస్...!

తేలిపోయిన వైసీపీ మేనిఫెస్టో



అన్ని వర్గాల పెదవివిరుపు

- వృద్ధుల పింఛన్ రూ.500 పెంచుతామన్న జగన్
- అది కూడా 2028 జనవరి నుంచి రూ.250
- 2029 జనవరి నుంచి మరో రూ.250...
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచే రూ.4,000 ఇస్తామని ఇప్పటికే తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు హామీ
- మూడు నెలలకు 1,000 చొప్పున ఎరియర్స్‌తో జూలైలో రూ.7,000 ఇంటి వద్దే అందజేస్తామని ప్రకటన
- అలాగే విశాఖ నుంచి స్టార్టప్‌లను వెళ్లగొట్టి... ఇప్పుడు హబ్‌గా చేస్తామంటూ వైసీపీ అధినేత మాయమాటలు
- ఈ ఐదేళ్లలో ఇచ్చింది... వచ్చే ఐదేళ్లలో ఇచ్చిందీ కలిపి దొంగ లెక్కలు
- గెలిస్తే విశాఖే పరిపాలనా రాజధాని అంటూ మళ్లీ ఊరింపు మాటలు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం తన మేనిఫెస్టో విడుదల చేశారు. అందులో అనేకం అవాస్తవాలే. గతంలో ఇచ్చిన హామీలనే అమలు చేయని ఆయన... వచ్చే ఐదేళ్లలో వాటిని కొనసాగిస్తూ మరింత లబ్ధి చేకూరుస్తానని మాయమాటలు చెప్పారు.



ముఖ్యంగా వృద్ధులకు నెల నెలా ఇచ్చే పింఛన్ విషయంలో ఆయన చేసిన ప్రకటనను చూసి లబ్ధిదారులంతా నవ్వుకుంటున్నారు. ప్రస్తుతం పింఛన్ నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. తాను మళ్లీ అధికారంలోకి వస్తే దానిని రూ.3,500 చేస్తానని జగన్ ప్రకటించారు. అయితే ఆ రూ.500 పెంచి జూలై నుంచి ఇస్తానని చెప్పలేదు. 2028 జనవరి నుంచి అంటే...నాలుగేళ్ల తరువాత రూ.250, 2029 జనవరి నుంచి మిగిలిన రూ.250 పెంచి ఇస్తామని వెల్లడించారు. కానీ ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఇదే వృద్ధాప్య పింఛన్లను తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.4 వేలు చొప్పున ఇస్తామని ఇంతకు ముందే హామీ ఇచ్చారు. అది కూడా ఈ ఏడాది ఏప్రిల్ నుంచే అమలు చేస్తామన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వేయి రూపాయలు చొప్పున మొత్తం రూ.3 వేలు, జూలై నెల రూ.4 వేల పింఛన్ కలిపి మొత్తం రూ.7 వేలు జూలైలో వృద్ధులకు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. వెంటనే అందే ప్రతిఫలంవైపే అంతా మొగ్గు చూపుతుండగా జగన్ మాత్రం మళ్లీ ఎన్నికలలో కూడా లబ్ధి పొందడానికి అన్నట్టు మాట్లాడడాన్ని పెన్షన్‌దారులు విమర్శిస్తున్నారు.

రాజధానిపై మళ్లీ ఊరింపు మాటలు

విశాఖపట్నమే పరిపాలనా రాజధాని...ఇదిగో వస్తున్నా.. అదిగో వస్తున్నా అంటూ మూడేళ్ల నుంచి ఊరింపు మాటలు చెప్పి ఆచరణలో చూపలేకపోయిన జగన్మోహన్‌రెడ్డి ఈసారి గెలిస్తే విశాఖ నుంచే పరిపాలన సాగిస్తానని మేనిఫెస్టోలో ప్రకటించారు. మూడు రాజధానుల అంశం కోర్టు పరిధిలో ఉంది. అది తేలకుండా విశాఖ నుంచి రాజధాని పేరుతో పరిపాలన చేసే అవకాశం లేనే లేదు. క్యాంపు కార్యాలయం పేరుతో ఏదైనా చేయాలే తప్ప రాజధాని అంటే వీలు కాదు. అయినా సరే విశాఖతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలను నమ్మించడానికి మోసం చేయడానికి మరో ప్రయత్నం చేశారు.

భోగాపురం విమానాశ్రయం పూర్తి మరో ఏడాదిన్నర గడువు

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడే శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే సహకారం అందించి ఉంటే ఈపాటికి అక్కడి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిచేవి. కానీ అలా జరగలేదు. జగన్ ఏడాది క్రితం మరోసారి దానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో అక్కడ వాయువేగంతో పనులు జరుగుతున్నాయని, మరో 18 నెలల్లో పూర్తిచేస్తామని చెబుతున్నారు. ఆ గడువులోగా పూర్తవుతుందా?...అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రపంచస్థాయి క్రికెట్ స్టేడియం ఎన్నిసార్లు చెబుతారో...?

విశాఖపట్నంలో ఇప్పటికే ఒక ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఉంది. మరొకటి నిర్మించాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. భోగాపురం సమీపాన రూ.300 కోట్లతో మరో కొత్త స్టేడియం నిర్మిస్తామని వైసీపీ నేతలే ప్రకటించారు. ఇప్పుడు దానిని 'ప్రపంచ స్థాయి స్టేడియం' అంటూ కలరింగ్ ఇచ్చి మేనిఫెస్టోలో చేర్చారు.

భీమిలి ఫిషింగ్ హార్బర్ అడ్రస్ ఏదీ?

భీమిలిలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రకటించారు. ఇప్పటివరకూ దానికి సంబంధించి ఎటువంటి పనులు చేపట్టలేదు. ఇప్పుడు మళ్లీ కొత్తగా పనులు చేపట్టిన ఫిషింగ్ హార్బర్లను పూర్తిచేస్తామని ప్రకటించారు. అసలు పనులు చేపట్టని భీమిలి హార్బర్ సముద్రంలో కలిసిపోయినట్టేనా?...అని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు.

పదేళ్ల లబ్ధికి లెక్కలు

వైసీపీ అమలు చేస్తున్న ప్రతి పథకంలో 2019-2024 ... మిగతా 6వ పేజీలో

స్టార్టప్స్ హబ్ అంటూ ప్రగల్భాలు



విశాఖపట్నాన్ని స్టార్టప్ హబ్‌గా చేస్తామని జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. అయితే ఆయన అసలు విషయం ఏమిటంటే...2014-19 మధ్య టీడీపీ హయాంలోనే విశాఖను స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దారు. రుషికొండలో స్టార్టప్ విలేజ్ ఏర్పాటుచేసి, అనేక మందికి అవకాశాలు కల్పించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అక్కడి స్టార్టప్‌లను ఖాళీ చేయించి బయటకు గెంటేసింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఏడాది క్రితం నుంచి దిద్దుబాటు చర్యలు చేపట్టి మళ్లీ కొత్త స్టార్టప్‌లకు ఆశ్రయం ఇచ్చింది. కానీ వారికి ఎటువంటి సహకారం అందడం లేదు. ఈ ప్రభుత్వ మాటలను నమ్మే పరిస్థితి లేదని ఇంజనీరింగ్ విద్యార్థులు బల్లగుద్ది చెబుతున్నారు. ఇక్కడ అవకాశాలు లభించకే ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నామని వాపోతున్నారు.

ఆటోవాలాల అసంతృప్తి



- 'వాహనమిత్ర' లబ్ధిదారులను తగ్గించి, ప్రమాద బీమా అంటూ ఆశ చూపుతారా?

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టోలో ఆటో/మాక్సీకాబ్, టాక్సీ, టిప్పర్/లారీ డ్రైవర్లకు రూ.పది లక్షలు ప్రమాద బీమా అమలు చేస్తామని ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనమిత్ర పేరుతో రూ.పది వేలు చొప్పున ఇచ్చిన సీఎం జగన్ ఏటేటా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారని, ఇప్పుడు కొత్తగా ప్రమాద బీమా పేరుతో తమ ఓట్లకు గాలం వేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆటో/టాక్సీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. వాహనమిత్రలో భాగంగా జిల్లాలో 2020-21లో 38,001 మందికి వాహనమిత్ర అందజేయగా 2022-23 నాటికి అర్హుల సంఖ్య 20,711కి తగ్గించేయడం ఆటోవాలాలపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమను తెలియజేస్తోందన్నారు. రకరకాల షరతులు, కారణాలతో 'వాహనమిత్ర' పథకానికి అర్హులను తగ్గించుకుంటూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రమాద బీమాను మేనిఫెస్టోలో చేర్చడం వల్ల కొత్తగా తమకు ఒనగూరేదేమీ లేదని ఆటో/టాక్సీవాలాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

చంద్రబాబునే గెలిపించుకుంటాం



200 రూపాయలు ఉన్న పింఛన్‌ను రెండు వేలకు పెంచిన చంద్రబాబు నా పాలిట దేవుడు. జగన్ మూడు వేలు చేస్తా నని మాకు మాయమాటలు చెప్పాడు. పద వివెక్కిన తరువాత ఐదు సంవత్సరాలకు మూడు వేలు చేశాడు. మా బాబు నాలుగు వేలు ఇస్తానని చెప్పాడు. జగన్ 3500 ఇస్తానంటున్నాడు. అది కూడా ఇప్పుడు కాదంటా....మా బాబు అయితే నాలుగు వేలు వెంటనే ఇస్తానన్నాడు. పింఛను పెంచి మాలాంటి వాళ్లకు తోడుగా ఉన్న చంద్రబాబును గెలిపించుకుంటాం.

- బి.సత్యవతి, గాజువాక

రూ.4 వేలు అయితే సంతోషంగా బతుకుతాను



నాకు నా అన్నవారు ఎవరూ లేరు. నాకు నాలుగు వేలు పింఛన్ ఇస్తే సంతోషంగా బతికేస్తాను. చంద్రబాబు దయ వల్ల నాకు అప్పుడు రెండు వేలు పింఛన్ వచ్చింది. జగన్ మూడు వేలు అని చెప్పి చివర్లో ఇచ్చాడు. చంద్రబాబు అయితే పింఛన్‌తో పాటు ప్రతి పండగకు మాకు తిన డానికి సామగ్రి ఇస్తాడు. మా బాబు చల్లగా ఉండాలి. పింఛన్ వస్తేనే మాకు బతుకు...లేదంటే లేదు.

- పి.గంగమ్మ, గాజువాక

పెన్షన్‌దారులకు బాబు వస్తేనే మేలు



జగన్మోహన్‌రెడ్డి హామీలు నమ్మలేము. గతంలో పింఛన్ రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ నెరవేర్చడానికి ఐదేళ్ల సమయం పట్టింది. ఏడాదికొక సారి రూ.250 పెంచుతామని అప్పట్లో చెప్పలేదు. ఇప్పుడు కూడా అదే హామీ ఇస్తున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరు. చంద్రబాబు హామీ ఇచ్చారంటే చేసి తీరుతారు. గతంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఒకేసారి పది రెట్లు పింఛన్‌ను పెంచారు. చంద్రబాబు వస్తే పింఛనుదారులకు మేలు జరుగుతుంది.

- దుండు నరేశ్, గోపాలపట్నం,

జగన్ హామీలను ప్రజలు నమ్మరు



నమ్మశక్యంకాని హామీలు ఇచ్చి గతంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. పింఛను విషయంలో కూడా అదే చేశారు. రూ.3 వేలు చేస్తామని చెబితే అంతా ఎంతో ఆశగా ఓటేశాం. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత దశలవారీగా పింఛన్ పెంచారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఒకేసారి రూ.4 వేలు చేస్తామని చెబుతున్నారు. చంద్రబాబునాయుడుపై విశ్వాసం ఉంది. జగన్ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు.

- బేరా కృష్ణారావు, గోపాలపట్నం

చందనోత్సవం నాడు అంతరాలయ దర్శనాలు రద్దు

- అప్పన్న నిజరూప దర్శనం భక్తులందరికీ కల్పించేలా ప్రణాళికలు
- ఘాట్‌రోడ్డులో 40 సాధారణ, 40 మినీ బస్సులకు మాత్రమే అనుమతి
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

సింహాచలం, ఏప్రిల్ 27: సింహగిరిపై వచ్చే నెల 10న జరగనున్న చందనోత్సవంలో భక్తులందరికీ అప్పన్న నిజరూప దర్శనం కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎం.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తితో కలిసి చందనోత్సవానికి అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నికల కోడ్ వల్ల ప్రొటోకాల్ దర్శనాలు లేవని స్పష్టంచేశారు. అంతరాలయ దర్శనాన్ని కూడా పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వైదిక కార్యక్రమాల అనంతరం వేకువజామున నాలుగు గంటల నుంచి గంటపాటు ధర్మకర్తల కుటుంబానికి, దేవాలయ దాతలకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించి, ఆ తరువాత నీలాద్రి గుమ్మం వద్ద నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికలు రూపొందించిందని, ... మిగతా 6వ పేజీలో

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లావ్యాప్తంగా 12147 మంది హాజరు

కంచరపాలెం, ఏప్రిల్ 27: జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. విశాఖ నగరం, పెందుర్తి, భీమిలి మూడు డివిజన్లలోని 28 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి 13021 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, శనివారం జరిగిన పరీక్షకు 12,147 మంది (93.3%) హాజరయ్యారు. వీరిలో 7,268 బాలురు, 4,879 బాలికలు ఉన్నారు. 874 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా పరీక్ష పూర్తయినట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ డా.కె.నారాయణరావు పేర్కొన్నారు. కాగా, సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.విజయభాస్కర్ నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

20,12,373

ఇదీ విశాఖ జిల్లా ఓటర్ల సంఖ్య

- పురుషులు 9,92,768, మహిళలు 10,19,487, ఇతరులు 118
- భీమిలి, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో మూడు లక్షలకుపైగా ఓటర్లు
- ఈ ఏడాది జనవరిలో తుది జాబితా
- విడుదల చేసిన తరువాత కొత్తగా 69,780 మంది చేరిక



అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
భీమిలి	1,78,090	1,84,908	15	3,63,013
విశాఖ తూర్పు	1,42,540	1,49,646	20	2,92,206
విశాఖ దక్షిణ	1,06,444	1,10,293	33	2,16,770
విశాఖ ఉత్తరం	1,40,788	1,44,979	22	2,85,789
విశాఖ పశ్చిమ	1,05,202	1,08,226	11	2,13,439
గాజువాక	1,67,112	1,66,487	12	3,33,611
పెందుర్తి	1,52,592	1,54,948	5	3,07,545
మొత్తం	9,92,768	10,19,487	118	20,12,373

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి పెద్ద నగరం విశాఖపట్నం...ఓటర్లపరంగా కూడా ముందుంది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు కలిగిన విశాఖ జిల్లా ఓటర్ల సంఖ్య 20 లక్షల మార్కును దాటింది. ఈ ఏడాది జనవరి 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు ఇచ్చారు. గడచిన మూడు నెలల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి అర్హత ఉన్నవారికి ఓటు హక్కు కల్పించారు. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య 20,12,373కు చేరింది. రాష్ట్రంలో 20 లక్షలకు మించి ఓటర్లు ఉన్న ఐదారు జిల్లాల్లో విశాఖ ఒకటిగా నిలిచింది. తాజా జాబితా మేరకు మొత్తం ఓటర్లలో పురుషులు 9,92,768, మహిళలు 10,19,487, ఇతరులు 118 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 26,719 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలోని భీమిలి, గాజువాక, పెందుర్తి నియోజక వర్గాల్లో మూడు లక్షలకుపైగా ఓటర్లు ఉండగా, విశాఖ తూర్పు నియోజక వర్గంలో మూడు లక్షలకు ఎనిమిది వేల ఓట్లు తక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 22న విడుదలైన తుది జాబితాలో జిల్లా ఓటర్లు 19,42,593 మంది ఉండగా గడచిన మూడు నెలల్లో 69,780 మంది కొత్తగా ఓటర్లుగా చేరారు. తాజా లెక్కల మేరకు అత్యధికంగా భీమిలిలో 3,63,013, తరువాత గాజువాకలో 3,33,611, పెందుర్తిలో 3,07,545 మంది ఓటర్లు ఉన్నారు. విశాఖ తూర్పులో 2,92,206, ఉత్తరంలో 2,85,789, దక్షిణంలో 2,16,770, పశ్చిమలో 2,13,439 మంది ఓటర్లు ఉన్నారు.

నెత్తురోడిన రహదారి

- నక్కపల్లి వద్ద ఘోర ప్రమాదం
- అదుపుతప్పి కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయిన కారు
- ముగ్గురి మృతి... మరో యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన కారు

నక్కపల్లి, ఏప్రిల్ 27: జాతీయ రహదారిపై అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుల్లో ఒక మహిళ, ఒక బాలుడు, మరో యువకుడు ఉన్నారు. దీనికి సంబంధించి నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



శరగడం వెంకటలక్ష్మి (ఫైల్)



దాడి గగన్ (ఫైల్)



సుంకర మధుకర్ (ఫైల్)

విశాఖ నగరంలోని బుచ్చిరాజుపాలేనికి చెందిన శరగడం వికాస్ (22), అతని తల్లి వెంకటలక్ష్మి (42) శనివారం కారులో కాకినాడ బయలుదేరారు. వారితో అగనంపూడిలో ఉంటున్న వికాస్ మేనమామ కుమారుడు దాడి గగన్ (15), వికాస్ స్నేహితుడు సుంకర మధుకర్ జత కలిశారు. సాయంత్రానికి పాయకరావుపేట చేరుకుని, అక్కడ గల బంధువుల ఇంట్లో ఉండి ఆదివారం ఉదయం కాకినాడ వెళదామనుకున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న కారు నక్కపల్లి దాటిన తరువాత కిలోమీటరు దూరంలో గల వెదుళ్లపాలెం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తుని నుంచి నక్కపల్లి వైపు వచ్చే మార్గంలోకి వెళ్లింది. అదే సమయంలో తుని నుంచి అడ్డరోడ్డు వైపు వస్తున్న ట్రాలర్ లారీ కిందకు కారు దూసుకుపోయింది. దీంతో కారు టాప్ లేచిపోయింది. కారు నడుపుతున్న వికాస్ తీవ్రంగా గాయపడగా, అతని కళ్ల ముందే వికాస్ తల్లి వెంకటలక్ష్మి (43), వికాస్ మేనల్లుడు దాడి గగన్ (15), వికాస్ స్నేహితుడు సుంకర మధుకర్ (22) మృతిచెందారు. ఈ ముగ్గురి శరీరాలు ఛిద్రమయ్యాయి. తీవ్రంగా గాయపడిన వికాస్‌ను అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి వద్ద ఆర్తనాదాలు

విషయం తెలిసిన వెంటనే వారి కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి, నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన సుంకర మధుకర్ బీటెక్ చదివి స్టీల్‌ప్లాంటులో అప్రంటీస్ చేస్తున్నాడు. మరో రెండు నెలల్లో ఎంఎస్ చేసేందుకు జర్మనీ వెళ్లాల్సి ఉందని, ఈలోగానే ఊహించని ప్రమాదం ముంచుకొచ్చిందని అతని తల్లిదండ్రులు సుశీల, మోహన్ కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో మృతిచెందిన బాలుడు గగన్ కొద్దిరోజుల కిందటే తొమ్మిదో తరగతి పరీక్షలు రాసి టెన్త్‌లోకి వచ్చాడు. తమ బంధువులతో కలిపి కారులో వెళుతున్నట్టు ముందు తమకు చెప్పలేదని, అగనంపూడి టోల్‌గేట్ దాటాక తమకు విషయం తెలిసిందంటూ తల్లిదండ్రులు దాడి కిషోర్, వరలక్ష్మి ... మిగతా 6వ పేజీలో

అదానీ పోర్టు శ్రమ దోపిడీ

- రెగ్యులర్ కార్మికులకూ అందని కనీస వేతనాలు
- 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారి వేతనం 15 వేలే
- విజయవాడ నుంచి కార్మిక శాఖ అదనపు కమిషనర్ రాక
- చర్చల్లో పాల్గొనని వెళ్లిపోయిన పోర్టు హెచ్‌ఆర్ ప్రతినిధి
- మరోవైపు చర్చలకు వచ్చిన కార్మికులకు 41-ఏ నోటీసులు
- పోలీసుల తీరుపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం
- వారు పోర్టు తరపున పనిచేస్తున్నట్టుందని ఆవేదన
- ఉద్యోగాలు వదిలేయడానికి రూ.25 లక్షలు ఇస్తామని ఆఫర్
- ఒక్కొక్కరికీ రూ.35 లక్షలు అడుగుతున్న కార్మికులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను భయపెడుతూ శ్రమ దోపిడీకి పాల్పడుతోంది. ఓ పక్క కార్మికులు కనీస వేతనాల కోసం ఆందోళన చేస్తుంటే.. వారికి నైపుణ్యం లేదని న్యాయస్థానంలో చెబుతోంది. అన్ని నైపుణ్యాలు ఉన్నవారికి కూడా సరైన వేతనాలు ఇవ్వడం లేదని తాజాగా శనివారం వెలుగులోకి వచ్చింది. వారంతా కార్మిక శాఖ అదనపు కమిషనర్‌ను ఆశ్రయిస్తే వారి విషయంలో చర్చలు జరిపేది లేదని చెప్పి పోర్టు ప్రతినిధి వెళ్లిపోయారు. మరోవైపు 18 రోజులుగా సమ్మె చేస్తున్న నిర్వాసిత కార్మికుల నాయకులను విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ చర్చలకు పిలిచి, వారు సమ్మె విరమణకు అంగీకరించకపోవడంతో 41-ఏ నోటీసులు ఇచ్చి పంపించారు. దీనిపై కార్మిక సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. పోలీసులు పూర్తిగా పోర్టు తరఫున పనిచేస్తున్నట్టు ఉందని ఆరోపిస్తున్నాయి.

వారితో అయితే మేం చర్చించం..

అదానీ గంగవరం పోర్టులో 18 రోజులుగా నిర్వాసిత కార్మికులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పోర్టులో మొత్తం రెండు వేల మంది కార్మికులు ఉండగా వారిలో నిర్వాసిత కార్మికులు 500 మంది ఉన్నారు. మిగిలిన వారంతా యాజమాన్యం అర్హతలను బట్టి నియమించుకున్నవారే. వేతనాలు పెంచాలని కోరుతూ నిర్వాసిత కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. పోర్టు గేట్లకు తాళాలు వేసేశారు. తమకు కూడా సరైన వేతనాలు ఇవ్వడం లేదని, న్యాయం చేయాలంటూ మిగిలిన 1,500 మంది కార్మికులు కూడా ఇప్పుడు ముందుకొచ్చారు. ప్రస్తుతం పోర్టు ఆపరేషన్లు ఆగిపోయి, విశాఖ స్టీల్‌ప్లాంటుకు ముడి పదార్థాల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దాంతో ప్లాంటు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోర్టు నుంచి ముడి పదార్థాలు అందేలా చూడాలని కోరుతూ విశాఖ స్టీల్ అధికారుల సంఘం హైకోర్టులో కేసు వేసింది. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ విజయవాడ నుంచి ... మిగతా 6వ పేజీలో


మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు


సోనియాగాంధీ నగర్‌లో కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ ఇబ్బందులే..

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27: వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. గ్రేటర్ 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సోనియాగాంధీనగర్, వైఎస్సార్‌నగర్, ఏఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వైఎస్సార్‌నగర్‌లో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు. తద్వారా చాలా మంది రూ.5కే భోజనం కడుపునింపినట్టు గుర్తుచేశారు. అటువంటి అన్న క్యాంటీన్‌ను జగన్మోహన్‌రెడ్డి తొలగించి పేదల పొట్ట కొట్టారన్నారు. ప్రసుతం రూ.12కే కొనుగోలు చేస్తున్న మద్యంను రూ.220కి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఏటా రూ. వేల కోట్లు డబ్బు ప్రభుత్వానికి వెళ్లకుండా తన సొంతానికే జగన్మోహన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. మద్యపానం నిషేధిస్తామన్న హామీనీ తుంగలోకి తొక్కారన్నారు. నగరంలో పాలిటెక్నిక్, ఆర్అండ్‌బీ క్వార్టర్స్, ఎమ్మార్వో కార్యాలయాన్ని తాకట్టు పెట్టారన్నారు. ఆ డబ్బును కూడా దోచుకున్నారన్నారు. మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయితే ఒక్క ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలు రావన్నారు. ఎవరైనా తప్పులు ఎత్తి చూపితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. గతంలో విద్యుత్ ధరలు పెరిగిపోయాయన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నో అరాచకాలు సృష్టించినట్టు ఆరోపించారు. అందుకోసం వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తే మళ్లీ కష్టాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజా పాలన కావాలంటే కమలం, సైకిల్ గుర్తుపై ఓటు వేసి భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలో యాదవులకు పెద్దపీట

» దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, ఏప్రిల్ 27: ఉత్తరాంధ్ర జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న యాదవులకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి పెద్దపీట వేసిందని, వైసీపీ మాత్రం వీరికి ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జ్ఞానాపురంలోని యాదవ సామాజిక వర్గీయులతో శనివారం సమావేశమయ్యారు. విశాఖలో దక్షిణంలో జనసేన తరపున యాదవ సామాజిక వర్గానికి చెందిన తనకు, గాజువాకలో టీడీపీ తరపున పల్లా శ్రీనివాస్‌కు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అవకాశం ఇచ్చారన్నారు. యాదవులను మరిచిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ 20 ఏళ్ల తరువాత దక్షిణ నియోజకవర్గాన్ని యాదవులకు కేటాయించిన కూటమికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవులకు మేలు చేసే పార్టీకే మద్దతు ఇస్తూ వారి వెంట ఉంటామన్నారు. కార్యక్రమంలో ఐతి రవిబాబు, నంబూరు శంకరావు, నొడగల ఆనందరావు, పి.జోజిబాబు, డి.ప్రసాద్, కె.భానోజీరావు, ఐతి మదుబాబు పాల్గొన్నారు.


వంశీకృష్ణకు ఘన స్వాగతం పలుకుతున్న జనాలు


ప్రచారంలో భాగంగా చెప్పులు కుడుతున్న వంశీకృష్ణ

శ్రీ సత్య పోలమాంబ దర్శించుకున్న వంశీకృష్ణ

పూర్ణామార్కెట్: గ్రేటర్ 37వ వార్డు ఆశీపావీధి శ్రీ సత్య పోలమాంబ అమ్మవారిని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్ శనివారం దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆశీస్సులతో విజయం సాధిస్తానన్నారు. భవిష్యత్తులో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరిస్తానని స్థానిక కమిటీ పెద్దలకు హామీ ఇచ్చారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అనంతరం పలువీధుల్లో ప్రచారం చేశారు.

ఆశీర్వదించి గెలిపించండి.. అండగా ఉంటా..

» వైసీపీ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి కేకే రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 27: తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానని ఉత్తర నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కేకే రాజు అన్నారు. శనివారం సీతమ్మధార రైతుబజార్, ఆక్సిజన్ టవర్స్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి బ్రోచర్‌లను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధిని వివరించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మేజారిటీతో గెలిపించాలని కేకే రాజు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, సీతమ్మధారలో ఎస్ఎఫెఎస్ పాఠశాల గేటు ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నుంచి విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మీతో పాటు కేకే రాజు ప్రచారం చేపట్టారు. 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్, బీఎస్ లేఅవుట్‌లలో ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, కోలా గురువులు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, చొక్కాకుల వెంకటరావు పాల్గొన్నారు.


సీతమ్మధారంలో వైసీపీ ఎంపీ అభ్యర్థినితో కలసి కేకే రాజు ప్రచారం


అక్కయ్యపాలెంలో జిమ్‌లో నమస్కరిస్తున్న చేస్తున్న కేకే రాజు

జిమ్‌ల్లో ప్రచారం

అక్కయ్యపాలెం : కేకే రాజు శనివారం అక్కయయ్యపాలెం ప్రధాన రహదారిలోని మారుతి జిమ్, మోహన్ జిమ్, ఇండియన్ జిమ్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు వారికి కరపత్రాలు పంపిణీ చేసిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ సింగ్, ఎం. సునీల్, అంబటి శైలేష్, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శేఖరరావు స్మారక క్రికెట్ ట్రోఫీ పీఎం పాలెం సీసీ వశం


ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 27: జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించిన డి.శేఖరరావు స్మారక క్రికెట్ టోర్నీ ట్రోఫీని పీ ఎం పాలెం సీసీ చాంపియన్ కైవసం చేసుకుంది. సీసీ విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో పీఎం పాలెం సీసీ ఐదు వికెట్ల తేడాతో సీసీ విశాఖపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీసీ విశాఖపట్నం 39.3 ఓవర్లలో 238 పరుగులు చేసింది. కేఎల్.శ్రీనివాస్ హాఫ్ సెంచరీ (63), రేవంత్ నాగకుమార్ (44) రాణించారు. పీఎం పాలెం బౌలర్లలో డి.రంజిత్‌కుమార్, పీవీ.శ్యాంకుమార్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పీఎం పాలెం సీసీ 27.4 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. రఖిన్ (92) సెంచరీ మిస్సవగా, ఎస్.నూకరాజు హాఫ్ సెంచరీ (77) రాణించి జట్టుకు సునాయాస విజయన్నందించారు. సీసీ విశాఖ బౌలర్ పృధ్వీకుమార్ రెండు వికెట్లు తీశాడు.

నరసింహనగర్‌లో ఆక్రమణల తొలగింపు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27: రహదారి ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ ఎస్. అమ్మినాయుడు తోపుడు బండ్ల వ్యాపారులను హెచ్చరించారు. నరసింహనగర్, రైతుబజారు ఎదుట శనివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.



కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వజ్జపర్తి శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకులు వజ్జపర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన గంపా గోవింద్ రాజీనామా చేయడంతో ఈ స్థానంలో వజ్జపర్తి శ్రీనివాసరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నియమించారు. ఈ నియామకం పట్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు విజయమే లక్ష్యంగా పనిచేయ నున్నట్టు ఆయన తెలిపారు. పార్టీలో పదవులు అనుభవించి బయటకు వెళ్లిన నాయకులు.. పార్టీపై విమర్శలు చేయడం తగదన్నారు. పార్టీ నాశనానికి కారణమైన నాయకులు పార్టీని విమర్శించడం సిగ్గు చేటన్నారు.

నేడు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట, ఏప్రిల్ 27: వైజాగ్ రన్నర్స్ సొసైటీ యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పనకు ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఆర్‌కే బీచ్‌లో '5 కే రన్ ఫర్ ఓట్' అనే పేరిట ర్యాలీ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. నగరంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల భాగస్వామ్యంతో ఈకార్యక్రమం చేపడుతున్నామన్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి పామ్‌బీచ్ వరకు ఈ చైతన్య ర్యాలీ సాగుతుందన్నారు. మేధావులు, ఓటర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రణాళికతోనే వైద్య, విద్య రంగాల అభివృద్ధి


రోటరీ సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27: సరైన ప్రణాళిక, మార్గదర్శకంతో విద్య వైద్యం, ఆరోగ్య రంగాల అభివృద్ధి సాధ్యపడుతుందని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ముంబై మహారాష్ట్ర డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ సాయిశంకర లండా పేర్కొన్నారు. శనివారం రోటరీ ఇంటర్నేషనల్ విశాఖ ఆధ్వర్యంలో 'సామాజికం' సీఎస్సార్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ అతిథులుగా హాజరై పీడీజీ శ్యామ్‌మొవ్వ, సంజాయ్‌పర్‌మర్, ఆర్.వెంకటరమణ, రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌టీఎన్ రావూరి సుబ్బారావు (దత్త)తో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. .కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం అధ్యక్షులు సీఏ డి.మధుసూదనరావుతోపాటు ఆర్.మెషినల్లి, రోటరీ కార్యదర్శి పీవీ రఘుపతి , ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల డీలర్ సస్పెన్షన్

మాధవధార, ఏప్రిల్ 27 ; విశాఖలో వాహనాలకు నకిలీ పేపర్లతో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ చేస్తు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించిన ట్రైస్టార్ డీలర్ రికగ్నైజేషన్ శనివారం సస్పెండ్ చేసినట్లు డీటీసీ జి.సి.రాజారత్నం తెలిపారు. విశాఖపట్నం సిటీలో ఉంటున్న వారికి అరుణాచల్ ప్రదేశ్‌లో నివాసం ఉంటున్నట్లు నివాస ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ఏపీ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగజేసినందున సదరు వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసిని ట్రైస్టార్ డీలర్ గుర్తింపుని సస్పెండ్ చేశారు.

వైసీపీ పాలనంతా ఆరాచకమే

» టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్


రక్తచరిత్ర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీతంరాజుసుధాకర్, నాయకులు

మహారాణిపేట, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనంతా అరాచకమే రాజ్యమేలిందని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజుసుధాకర్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ సాగించిన ఆరాచక పాలనపై తమ పార్టీ చార్జిషీట్ విడుదల చేసినట్టు చెప్పారు. ఇసుక మాఫియాతో భవన నిర్మాణ కార్మికులు కుదేలయ్యారని, మత్స్యకారులకు ఎటువంటి న్యాయంజరగలేదని ఆరోపించారు. కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణ, విల్లూరి భాస్కర రావు , నాయకులు వానపల్లి గాయత్రి, ఎర్నాకుల జగదీష్, విల్లూరి చక్రవర్తి, గనగళ్ల సత్యవతి డోకర రమణ, పొడుగు కుమార్ పాల్గొన్నారు.

అల్లిపురం: టీడీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన సీతంరాజు సుధాకర్‌ను 33వార్డు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ విల్లూరి తిరుమలాదేవి, విశాఖటీడీపీ పార్లమెంటరీపార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి కలసి సత్కరించారు

ప్రేమ పేరుతో మోసగించి యువకుడి అరెస్టు

కంచరపాలెం, ఏప్రిల్ 27: ప్రేమపేరుతో ఓ యువతిని మోసగించిన యువకుడిని కంచరపాలెం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి కొత్తపెంట గ్రామానికి చెందిన మరణ అజయ్‌కుమార్ (23) నగరంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతనికి కంచరపాలెం ప్రాంతానికి చెందిన రాణి (21)తో ఏడాది క్రితం పరిచయమైంది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో స్థానిక ధర్మానగర్‌లో సహజీవనం చేశాడు. పెళ్లి విషయం ప్రస్తావించడంతో అజయ్‌కుమార్ ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న రాణి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాలాపువానిపాలెంలో దారుణ హత్య


శ్రీనివాసరావు(ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 27: మండలంలోని గొటివాడ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పొలంలో మోటారు వేయడానికి వెళ్లిన అతడ్ని దారి కాసి ఇద్దరు యువకులు హతమార్చారు. వివాహేతర సంబంధమే కారణమని భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాసరావు(30)కు దువ్వాడ దరి మంగళపాలేనికి చెందిన భాగ్యలక్ష్మితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు లా వర్సిటీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి వచ్చాడు. రాత్రి 11 గంటలకు మోటారు వేసేందుకు పొలానికి వెళ్తుండగా ఇద్దరు యువకులు మంచం కోడుతో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనను సమీపంలోని ఉగ్గిన నూకాలమ్మ చూసి కేకలు వేసింది. దీంతో యువకులు అతడ్ని ఈడ్చుకు పోయారు. హతుడి తండ్రి అప్పారావు వెళ్లి చూడగా కాలువలో శ్రీనివాసరావు మృతదేహం కనిపించింది. వెంటనే పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. క్లూస్ బృందం వివరాలు సేకరించింది. మృత దేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యా ప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. కాగా మూడేళ్లుగా స్థానిక గల్లి రవికుమార్‌తో శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మి సన్నిహితంగా ఉంటోంది. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే హత్యకు కారణంగా భావిస్తున్నారు. నిందితులు రవికుమార్, గరికిపాటి హరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి

» తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి.అనిత

మురళీనగర్, ఏప్రిల్ 27; ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి. అనిత పేర్కొన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులతో మురళీనగర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాయకరావుపేట నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న తాను రాష్ట్రవ్యాప్త పార్టీ బాధ్యతల నేపథ్యంలో ముఖ్య నేతలను కలిసి కూటమి విజయానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఐదేళ్లపాటు నేరస్తుని చేతిలో రాష్ట్రాన్ని పెట్టిన జనం ఇపుడు పునరాలోచించి నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందని అనిత పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల తీర్పు కూటమికి గెలుపు అందిస్తుందని తాను నమ్ముతున్నానన్నారు.


సమావేశంలో అనితతో సనపల.వరప్రసాద్ తదితరులు

టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సనపల.వరప్రసాద్ వంగలపూడి.అనిత శాసనసభలో తన స్వరం బలంగా వినిపించే సమర్థత ఉన్న తెలుగు మహిళ నేత అని కొనియాడారు. నాయకులు విజయరామరాజు, జనార్ధన్, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి

భోరుమన్నారు. తీవ్రంగా గాయపడిన వికాస్ ఇంజనీరింగ్ చదివాడు. రెండు నెలల్లో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు అతని తండ్రి నరసింగరావు చెప్పారు. తన జీవిత భాగస్వామి వెంకటలక్ష్మి కారులో రక్తపు మడుగలో నిర్జీవంగా ఉన్న దృశ్యాన్ని చూసి ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదానికి గురైన వారంతా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు బంధువులు కావడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనసేన నేత గెడ్డం బుజ్జి నక్కపల్లి ఆస్పత్రికి వచ్చి మృతుల బంధువులను పరామర్శించారు. మృతదేహాలకు నక్కపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

తుస్...!

... 5వ పేజీ తరువాయి

కాలంలో పొందిన లబ్ధి, వచ్చే ఐదేళ్లలో చేయబోయే సాయం కలిపి..మొత్తం పదేళ్లకు తాను ఎంత ఇవ్వబోతున్నదీ జగన్మోహన్‌రెడ్డి లెక్కలు వేసి వివరించారు. ఉదాహరణకు మత్స్యకారులకు భరోసా కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున గత నాలుగేళ్లలో రూ.40 వేలు ఇచ్చారు. ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. రాబోయే ఐదేళ్లలో మరో రూ.50 వేలు ఇస్తామని, తద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష రూపాయలు అవుతుందని,లబ్ధి రెట్టింపవుతుందంటూ జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు చెప్పారు. చేయూత, అమ్మఒడి అన్ని పథకాలకుఇలాగే పదేళ్ల లెక్కలు వేసి రెట్టింపు చూపించారు.

చందనోత్సవం నాడు అంతరాలయ దర్శనాలు రద్దు

... 5వ పేజీ తరువాయి

40 సాధారణ బస్సులు, 40 మినీ బస్సులను మాత్రమే ఘాట్ రోడ్డులో రాకపోకలకు అనుమతిస్తామని చెప్పారు. టికెట్లు రీ సేల్ జరగకుండా ప్రతి టికెట్‌ను రెండుసార్లు పంచింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, బార్ కోడ్ తప్పనిసరిగా ఉంటుందన్నారు. బయటకు వెళ్లే మార్గం నుంచి ఎవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య దేవాలయ సిబ్బందికి ప్రత్యేక దర్శనాలకు అనుమతిస్తామని, 4 నుంచి 5 వరకు దివ్యాంగులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. రూ.1,500 టికెట్లు గతంలో కంటే తక్కువగా ముద్రించాలని నిర్ణయించామని, అవసరమైతే తదుపరి నిర్ణయం మేరకు 7 వేల కంటే తక్కువకు తగ్గిస్తామన్నారు. చందనోత్సవం టికెట్లను వచ్చే నెల రెండో తేదీ నుంచి విక్రయించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్, అడిషినల్ సీపీ ఫకీరప్ప, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అదానీ పోర్టు శ్రమ దోపిడీ

... 5వ పేజీ తరువాయి

శనివారం విశాఖపట్నం వచ్చారు. గంగవరం పోర్టు కార్మిక సంఘాల ప్రతినిధులను చర్చల నిమిత్తం నగరంలోని కార్మిక శాఖ అధికారి కార్యాలయానికి పిలిచారు. యాజమాన్యం తరపున ఒక అధికారి హాజరయ్యారు. సమ్మె చేస్తున్నది వీరు కాదని, నిర్వాసిత కార్మికులని ఆ అధికారి పేర్కొన్నారు. దీంతో చర్చలకు హాజరైన కార్మికుల్లో పలువురు లేచి, తమకు అన్ని అర్హతలూ, నైపుణ్యం ఉన్నా కనీస వేతనాలివ్వడం లేదని, తమకూ వేతనాలు పెంచాలని కోరారు. నిర్వాసిత కార్మికుల సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. దీంతో పోర్టు ప్రతినిధి లేచి.. ఈ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు తనకు యాజమాన్యం అనుమతి ఇవ్వలేదని బయటకు వెళ్లిపోయారు.

ఎవరికైనా రూ.15 వేలే జీతం..

కార్మిక శాఖ అధికారి కార్యాలయానికి వచ్చిన పోర్టు కార్మికులు మాట్లాడుతూ.. నిర్వాసిత కార్మికులు తోట పని, క్లీనింగ్, కొందరు కలాసీలుగా చేస్తారని, తాము మాత్రం యాజమాన్యం పెట్టిన పరీక్షలు పాసై విధుల్లో చేరామని చెప్పారు. 15 ఏళ్ల నుంచి చేస్తున్నా, ఇంకా రూ.15 వేలు మాత్రమే జీతంగా ఇస్తున్నారని చెప్పారు. జీతం పెంచాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసిత కార్మికుల సమ్మెకు తాము కూడా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఉత్తరాది నుంచి వచ్చిన వారికే పోర్టులో ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఇక్కడి వారికి శ్రమ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

కార్మికులకు నోటీసులు

సమ్మె చేస్తున్న నిర్వాసిత కార్మికుల నాయకులను నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యన్నార్ శనివారం చర్చలకు పిలిచారు. మొత్తం 12 మంది నాయకులు రాగా వారితో చర్చించారు. ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోవడానికి తమకు మనిషికి రూ.35 లక్షలు ఇవ్వాలని వారు కోరగా, పోర్టు యాజమాన్యంతో మాట్లాడి రూ.25 లక్షల వరకు ఇప్పించగలమని కమిషనర్ హామీ ఇచ్చారు. అంత తక్కువైతే తాము సమ్మెలోనే ఉంటామని నాయకులు చెప్పారు. దీంతో వారందరికీ న్యూపోర్టు పోలీస్ స్టేషన్ అధికారితో 41-ఏ నోటీసులు ఇప్పించారు. తాము ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని, ఎటువంటి ఆందోళనలు చేయకూడదని చెప్పి పంపించారు.



వైసీపీ అరాచకాలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గణబాబు, తదితరులు

ప్రభుత్వ దురాగతాలను గుర్తించి కూటమి అభ్యర్థులను గెలిపించండి

తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 27: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అరాచక పాలన జరిగిందని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని తమ నివాసంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన ప్రతినిధులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, ప్రజలపై ఎన్నడూ లేని విధంగా పన్నుల భారం పడిందని మండిపడ్డారు. ఆఖరికి చెత్తపై పన్ను వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి కుటుంబంపై రూ.పది లక్షల భారం మోపిందని ఆరోపించారు. వైసీపీ పాలనలో భూ కబ్జాలు పెరిగిపోయాయని, మైనింగ్ మాఫియా అరాచకాలు పెచ్చు మీరాయన్నారు. రాష్ట్రంలో గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, మైనింగ్ మాఫియా పెరిగిపోయిందని పేర్కొన్నారు. మద్యం వ్యాపారి పాత్రను పోషిస్తున్న వైసీపీ ప్రభుత్వం విషపూరితమైన, నాసిరకం మద్యంతో రాష్ట్రంలో 35 లక్షల మంది అనారోగ్యానికి గురయ్యేలా చేసిందని విమర్శించారు. వైసీపీ పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచారని, ఎందరో పేదలకు ఆసరాగా ఉన్న అన్నా క్యాంటీన్లను మూసివేయించిదని గణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మద్య నిషేధాన్ని అమలు చేస్తామని మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అన్నింటినీ జగన్ విస్మరించారన్నారు. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై ఎన్డీఏ చార్జిషీటు రూపొందించామని, వైసీపీ దురాగతాలను ప్రజలంతా గ్రహించి కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని అరాచక పాలన నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్డీఏ చార్జిషీటు కరపత్రాలను కూటమి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రతినిధి దుర్గా ప్రశాంతి, బీజేపీ ప్రతినిధి డి.వెంకటరమేశ్, పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలి

మే ఒకటో తేదీన లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలని గణబాబు డిమాండ్ చేశారు. ఇళ్ల వద్ద లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తుందన్నారు. ప్రతి లబ్ధిదారునికి ఇంటి వద్దే పెన్షన్ అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని గణబాబు కోరారు.

ప్రజలను దగా చేయడమే వైసీపీ లక్ష్యం

రానున్నది కూటమి ప్రభుత్వం

తెలుగుదేశం పార్టీ 'గాజువాక' అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



76వ వార్డులో దరువేస్తూ ప్రచారం సాగిస్తున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 27: ప్రజలను మోసం చేయడం, వంచించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డులో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిత్యావసర సరకుల ధరలను విపరీతంగా పెంచేశారని, నాసిరకం మద్యం విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లోనే ప్రజలు మెచ్చే పాలన వస్తుందని, చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేకూరుస్తామన్నారు. గాజువాకలో భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. గాజువాకలో క్రెడిట్ కొట్టేద్దామని భూ సమస్యపై వైసీపీ డ్రామా ఆడిందని, దీనిని ప్రజలు తిప్పికొట్టారన్నారు. డీడ్ ఆఫ్ కన్వెన్షన్ పేరుతో ప్రజల నుంచి నగదు వసూళ్లు చేసి మోసం చేశారని మండిపడ్డారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు గొలగాని గోపీచంద్, జి.శంకరరావు, వెంకటరావు, రమణారెడ్డి, రంగా, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ వెంకునాయుడు



శ్రీభరత్, గండి బాబ్జీలతో గొర్లె వెంకునాయుడు, తదితరులు

గాజువాక ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు తన అనుచరులతో కలిసి శనివారం తెలుగుదేశం పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ సమక్షంలో టీడీపీలో చేరారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకునాయుడును వారు టీడీపీలోకి ఆహ్వానించారు. గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు, ఎంపీగా శ్రీభరత్ విజయానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకునాయుడు పేర్కొన్నారు.



61వ వార్డులో ఆడారి ఆనంద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



92వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఆడారి మాలతి

ప్రజాసేవ అంటే చాలా ఇష్టం

మోసపూరిత హామీలను మేమివ్వం

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఏప్రిల్ 27: తనకు ప్రజాసేవ చేయడమంటే చాలా ఇష్టమని, తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలందరినీ సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటానని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు పరిధి మల్కాపురంలో శనివారం సాయంత్రం ఆయన రోడ్డు షో నిర్వహించారు. ఆయనకు ప్రజలు అడుగడుగునా మంగళ హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ఎంతో అద్భుతంగా ఉందన్నారు. తాము సాధ్యమయ్యే హామీలతోనే ప్రజల ముందుకు వస్తున్నామని, సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయలేమని, మోసపూరితమైన బుద్ధి టీడీపీ అధినేత చంద్ర బాబుకే ఉందని విమర్శించారు. ఎన్నికలు ముగిసేంత వరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తనను ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మేనిఫెస్టోలో ఉన్న హామీలన్నింటికీ జగన్ అమలు చేస్తారని హామీ ఇచ్చారు. 2019లో ఇచ్చిన హామీలను ఏ విధంగా అయితే అమలు చేశారో, ఈసారి కూడా అన్నింటినీ అమలు చేయడం జరుగుతుందని ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. మల్కాపురం మెయిన్ రోడ్డు, నగరాల వీధి, యాదవ వీధి, రెడ్డివీధి, శెట్టిబలిజీల వీధి, జాలరవీధి, ఎస్సీకాలనీ, అంబేడ్కర్ కాలనీ, బాపూజీ కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, ఏడుగుళ్ల జంక్షన్ ప్రాంతాల్లో ఆయన రోడ్డు షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వైసీపీ వార్డు అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు (వాసు), క్లస్టర్ అధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం, నాయకులు ఎం.అప్పారావు, పి.రామ్మోహన్ రెడ్డి (రాము) నూకరెడ్డి, అంగ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

92వ వార్డులో ఆడారి సతీమణి మాలతి ప్రచారం

గోపాలపట్నం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా తన భర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీరాణిని అధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి కోరారు. ప్రచారంలో భాగంగా 92వ వార్డు ఎస్సీ,బీసీ కాలనీలో మాలతి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆనంద్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే 'పశ్చిమ'ను ఆదర్శనీయంగా అభివృద్ధి చేస్తారన్నారు. అందువల్ల ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు, అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పూచీ మాది.. అభ్యర్థుల గెలుపు బాధ్యత మీది

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని, 'పెందుర్తి' అభ్యర్థి గణబాబు కోడలు నిహారిక



తేజస్విని, నిహారికలకు పూలమాల వేస్తున్న దృశ్యం

మల్కాపురం/సింధియా, ఏప్రిల్ 27: రాష్ట్రం, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పూచీ మాది.. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు బాధ్యత మీదంటూ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సతీమణి, ప్రముఖ హీరో బాలకృష్ణ కుమార్తె తేజస్విని, అసెంబ్లీ అభ్యర్థి పి.గణబాబు కోడలు నిహారిక అన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీలో శనివారం వారు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ప్రాంతంలో చదువుకునే విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రేరీని ఏర్పాటు చేస్తామని, అన్నా క్యాంటీన్‌ను పునఃప్రారంభిస్తామన్నారు. ఎంతో ఉన్నతంగా ఆలోచించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల శ్రేయస్సు కోసం చంద్రబాబు నాయుడు రూపొందించారని, ఈ పథకాలు అన్ని వర్గాల వారికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఇక్కడి నిరుద్యోగ సమస్యను, టిడ్కో ఇళ్ల సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అంగ దుర్గాప్రశాంతి, ఆర్ఆర్‌రాజు, గేదెల రమణ, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు స్ఫూర్తితో విజయం సాధిస్తాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షా శిబిరంలో అమృతరావు చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 27: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం సృష్టికర్త దివంగత తమనంపల్లి అమృతరావు స్ఫూర్తితో తాము ఉద్యమంలో విజయం సాధిస్తామని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. అమృతరావు వర్ధంతి సందర్భంగా కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల దీక్షా శిబిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పోరాట కమిటీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ స్థాపన కోసం అమృతరావు చేసిన కృషి అమోఘమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. నాయకుడు వరసాల శ్రీనువాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే నిర్వాసితులకు, వేలాదిమంది కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కానీ ఎన్ఎండీసీలో గానీ విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, యు.రామస్వామి, పరంధామయ్య, గోపి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో నివాళి

ఉక్కుటౌన్‌షిప్: ఉక్కు కర్మాగారం సత్యాగ్రహి దివంగత టి.అమృతరావు ప్లాంట్ కోసం చేసిన త్యాగం మరువలేనిదని టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో అమృతరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో స్థాపించిన ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, కోగంటి లెనిన్ బాబు, సింహాద్రి, నారాయణ, నాగేశ్వరరావు, ఉగ్రం, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కుకు కొత్తగా రెండు జిరాఫీలు



విశాఖపట్నం, ఏప్రిల్ 27: నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూ పార్కుకు) శనివారం కొత్తగా రెండు జిరాఫీలు వచ్చాయి. కోల్‌కత్తాలోని అలీపూర్ జూలాజికల్ పార్కు నుంచి వీటిని తీసుకువచ్చినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు. వాటితో పాటు ఆరు కొత్త జంతువులను కూడా తీసుకువచ్చారు. ప్రస్తుతం వాటిని 40 రోజుల పాటు క్వారంటైన్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అనంతరం సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు. జంతు మార్పిడి పద్ధతిలో వీటిని తీసుకువచ్చారు.

బావిలో స్నానానికి దిగి విలేకరి మృతి



రవికుమార్ (ఫైల్)

దేవరాపల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని ముషిడిపల్లి గ్రామం కొటాన వారి కల్లాల సమీపంలో గల వ్యవసాయ బావిలో పడి విశాఖ జిల్లా వేపగుంటకు చెందిన సింగూరు రవికుమార్(45) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివి. వేపగుంటలోని ఓ చిన్న పత్రికలో విలేకరిగా పని చేస్తున్న రవికుమార్ అతని సోదరుడు సుధాకర్‌తో కలిసి బైక్‌పై శనివారం ముషిడిపల్లి విచ్చేశారు. వీరికి పరిచయం ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు దార్ల సత్యారావు పొలంలోకి ఉదయం 11.30 గంటల ప్రాంతంలో వెళ్లారు. అతనితో కాసేపు మాట్లాడాక పొలంలో గల నూతిలో అన్నదమ్ములు ఇద్దరూ స్నానానికి దిగారు. కొంతసేపు ఈత కొట్టిన తరువాత సుధాకర్ బయటకు వచ్చేశాడు. కానీ రవికుమార్ బావిలో ఉన్న మెట్లపై కూర్చొని ఉన్నాడు. కాసేపటి తరువాత సుధాకర్ బావిలో చూడగా రవికుమార్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిపించి నూతిలో గాలించగా, రవికుమార్ మృతదేహం లభ్యమైంది. ఇదిలావుంటే, రవికుమార్‌కు భార్య అనూరాధ, విహాన్, బన్నీ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతని కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండగా, ఇతడు తన తండ్రి జగన్నాథంతో కలిసి వేపగుంటలో నివాసం ఉంటున్నాడు. ఈ ఘటనపై మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇదిలావుంటే, బావిలో దిగిన సమయంలో అన్నదమ్ములు ఇద్దరూ మద్యం తాగి ఉంటారని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ

గాజువాక, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై శనివారం గాజువాక జోనల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాజువాక రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి ఈవీఎంలను ఎలా వినియోగించాలి, ఎన్నికల సమయంలో ఏ విధంగా వ్యవహరించాలి, ఈవీఎంలో ఇబ్బందులిస్తే ఏం చేయాలనే అంశాలను వివరించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.

ఘనంగా బండిమాంబ ఉత్సవాలు

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 27: మండలంలోని చింతలఅగ్రహారం గ్రామంలో బండిమాంబ ఉత్సవాలను భక్తుల కోలాహలం నడుమ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక త్రిమాత ఆలయం వద్ద గ్రామ దేవతలకు మంగళస్నానాలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లకు వసంతాభిషేకాలు చేశారు. అలాగే పొర్లుపాలెం క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందిస్తారు.

65వ వార్డులో అమర్‌నాథ్ ప్రచారం

పెదగంట్యాడ, ఏప్రిల్ 27: వైసీపీ గాజువాక అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్ శనివారం 65వ వార్డులోని ప్రియదర్శనీ కాలనీ, సంజీవగిరి కాలనీ, గిరిజాకాలనీ, వాంబే కాలనీ, అశోక్‌నగర్‌లలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 25, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 20, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 36, బరబాటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 32, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్రరపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 3లో..



అనకపల్లి సున్నంబట్టీల వద్ద మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు


జగన్ పాలనకు చరమగీతం పాడాలి

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 27: సీఎం జగన్ అరాచక పాలనకు ప్రజలంతా చరమగీతం పాడాలని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తో కలసి అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద పసలతల్లి అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సున్నంబట్టీలు, జాగారపువానిపాలెం, పల్లవానిపాలెం, గాలిబీమవరం, నాయనమ్మపాలెం, టెక్కలిపాలెం, రాపురఅగ్రహారం, వంగలి గ్రామాల్లోని మహిళలు ఆయనకు మంగళహారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో పంచకర్ల మాట్లాడుతూ అన్ని రంగాలను సర్వనాశనం చేసిన రాష్ట్రం గాడిలో పడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కూటమి విజయం చారిత్రక అవసరమన్నారు. వైసీపీని మించిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సామాజిక పింఛన్లు రూ.నాలుగు వేలు, దివ్యాంగుల పెన్షన్లను రూ.ఆరు వేలకు పెంచడం జరుగుతుందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 15 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ వంటి పథకాలను అమలులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనకు గాజు గ్లాసు గుర్తుపై, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. గండి బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ నేతల కల్లిబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, దోపిడీ చేసిన సొమ్ము వారివద్ద పుష్కలంగా ఉందని, వారిచ్చిన డబ్బులు తీసుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బాబూరావు, గండి వంశీ, కర్రి కనకరాజు, నరసింగరావు, బలిరెడ్డి అప్పారావు, వి.గోవింద, పి.శ్రీను, పి.రమణ, పి.అప్పలనాయుడు, ఎ.గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీలతో మమేకమైన పంచకర్ల సతీమణి మహాలక్ష్మి

పెందుర్తి: జనసేన పార్టీ పెందుర్తి నియోజవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మహాలక్ష్మి ఉపాధి మహిళా కూలీలతో మమేకమై ప్రచారం చేశారు. మండలంలోని వాలిమెరక, ముదపాకలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలతో ఆమె మాట్లాడడమే కాకుండా వారి నెత్తిన మట్టితట్టను ఎత్తి సాయపడ్డారు. తట్ట ఎత్తి మీకు సాయపడ్డా.. గంపగుత్తిగా ఓట్లు వేసి తన భర్తను గెలిపించాలని కోరారు. అనంతరం వారికి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి శ్రీనివాసులనాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, నాయకులు అయిత సింహాచలం, రెడ్డి నారాయణరావు, కునుకంటి కనకరాజు, ఎర్రా సత్యనారాయణ, శివకిరణ్ సంతోష్, కె.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా కూలీ నెత్తిన మట్టి తట్ట పెడుతున్న మహాలక్ష్మి

హెచ్‌ఆర్ అభ్యాసాలపై స్టీల్‌ప్లాంటులో కాన్ఫరెన్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హేమంత్ ఖత్రి, పాండే

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 27: హెచ్‌ఆర్ పద్ధతుల ద్వారా మనం అవలంబించే పరివర్తన మార్పుల ద్వారా 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ కంపెనీ సీఎండి హేమంత్ ఖత్రి పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసీ సెంటర్‌లో సెంట్రల్ రీజియన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) ఆధ్వర్యంలో ఒకరోజు హెచ్‌ఆర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏ సంస్థలోనైనా హెచ్‌ఆర్ కార్యకలపాలు చాలా ముఖ్యమైనవన్నారు. అసాధారణమైన సంస్థాగత సంస్కృతిని సృష్టించడం హెచ్‌ఆర్ అభ్యాసాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండే మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ ద్వారా పరస్పర చర్యలు, జ్ఞానాన్ని పంచుకునే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఐపీఎంకు చెందిన ఎస్వీఎస్ సహకర్, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.కృష్ణకుమారి, ఎన్ఐపీఎం జాతీయ అధ్యక్షుడు ఎం.హెచ్.రాజా, ఉక్కు అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యత్వానికి బెహరా రాజీనామా

గోపాలపట్నం, ఏప్రిల్ 27: జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యునిగా కొనసాగుతున్న బెహరా భాస్కరరావు తన పదవికి రాజీనామా చేస్తూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి రాజీమానా పత్రాన్ని శనివారం సమర్పించారు. అనారోగ్య సమస్యల వల్ల కో-ఆప్షన్ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని, అందుకే రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. తన రాజీనామాను మేయర్ అంగీకరించినట్టు బెహరా తెలిపారు.

సంకటహర చతుర్థి వేడుకలు

అగనంపూడి, ఏప్రిల్ 27: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సంపత్ వినాయకుని ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీనివాసరావు, వి.నారాయణరావు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇ-మర్రిపాలెం బస్టాప్ కూడలిలో గల రుణ విమోచన లక్ష్మీగణపతిస్వామి ఆలయంలోనూ సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిరక్షణ కోసం ఇంటక్ రాజీలేని పోరాటాలు'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 27: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు రాజీ లేని పోరాటాలు చేస్తున్నామని ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పది శాతం షేర్ల విక్రయిస్తామని కేంద్రం ప్రకటించడంతో నాడు స్టీల్‌ప్లాంట్‌లో అధికారంలో ఉన్న ఇంటక్ యూనియన్ కేంద్రంపై పోరాటాలు చేయడంతో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందన్నారు. ఆ తర్వాత ప్లాంట్‌లో వామపక్ష సంఘాలు అధికారంలోకి వచ్చాయని, అప్పటినుంచి ప్లాంట్‌కు, కార్మిక వర్గానికి కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బీఎంకే నాయక్, సుదర్శనం, ఎస్ఏ నాయుడు, మొల్లి ఈశ్వరరావు, మంత్రి గోపీనారాయణ, డి.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'దళితులను దగా చేసేందుకు సిద్ధపడ్డ సీఎం జగన్'

పెదగంట్యాడ, ఏప్రిల్ 27: రాష్ట్ర ముఖ్యమంత్రి మేనిఫెస్టో చూస్తే దళితులపై జగన్ నిజ స్వరూపం బయటపడిందని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీలకు చోటు లేకుండా పోయిందని, అందువల్ల ప్రచారంలో నా ఎస్సీ, నా ఎస్టీ అనే హక్కు జగన్‌కు లేదన్నారు. ఎస్సీల రుణ పథకాలకు వైసీపీ సర్కారు శాశ్వతంగా సమాధి కట్టిందని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు


సోనియాగాంధీ నగర్‌లో కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ ఇబ్బందులే..

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27: వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. గ్రేటర్ 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సోనియాగాంధీనగర్, వైఎస్సార్‌నగర్, ఏఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వైఎస్సార్‌నగర్‌లో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు. తద్వారా చాలా మంది రూ.5కే భోజనం కడుపునింపినట్టు గుర్తుచేశారు. అటువంటి అన్న క్యాంటీన్‌ను జగన్మోహన్‌రెడ్డి తొలగించి పేదల పొట్ట కొట్టారన్నారు. ప్రసుతం రూ.12కే కొనుగోలు చేస్తున్న మద్యంను రూ.220కి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఏటా రూ. వేల కోట్లు డబ్బు ప్రభుత్వానికి వెళ్లకుండా తన సొంతానికే జగన్మోహన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. మద్యపానం నిషేధిస్తామన్న హామీనీ తుంగలోకి తొక్కారన్నారు. నగరంలో పాలిటెక్నిక్, ఆర్అండ్‌బీ క్వార్టర్స్, ఎమ్మార్వో కార్యాలయాన్ని తాకట్టు పెట్టారన్నారు. ఆ డబ్బును కూడా దోచుకున్నారన్నారు. మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయితే ఒక్క ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలు రావన్నారు. ఎవరైనా తప్పులు ఎత్తి చూపితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. గతంలో విద్యుత్ ధరలు పెరిగిపోయాయన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నో అరాచకాలు సృష్టించినట్టు ఆరోపించారు. అందుకోసం వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తే మళ్లీ కష్టాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజా పాలన కావాలంటే కమలం, సైకిల్ గుర్తుపై ఓటు వేసి భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలో యాదవులకు పెద్దపీట

» దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్


వంశీకృష్ణకు ఘన స్వాగతం పలుకుతున్న జనాలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 27: ఉత్తరాంధ్ర జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న యాదవులకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి పెద్దపీట వేసిందని, వైసీపీ మాత్రం వీరికి ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జ్ఞానాపురంలోని యాదవ సామాజిక వర్గీయులతో శనివారం సమావేశమయ్యారు. విశాఖలో దక్షిణంలో జనసేన తరఫున యాదవ సామాజిక వర్గానికి చెందిన తనకు, గాజువాకలో టీడీపీ తరఫున పల్లా శ్రీనివాస్‌కు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అవకాశం ఇచ్చారన్నారు. యాదవులను మరిచిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ 20 ఏళ్ల తరువాత దక్షిణ నియోజకవర్గాన్ని యాదవులకు కేటాయించిన కూటమికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవులకు మేలు చేసే పార్టీకే మద్దతు ఇస్తూ వారి వెంట ఉంటామన్నారు. కార్యక్రమంలో ఐతి రవిబాబు, నంబూరు శంకరావు, నొడగల ఆనందరావు, పి.జోజిబాబు, డి.ప్రసాద్, కె.భానోజీరావు, ఐతి మదుబాబు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా చెప్పులు కుడుతున్న వంశీకృష్ణ

శ్రీ సత్య పోలమాంబ దర్శించుకున్న వంశీకృష్ణ

పూర్ణామార్కెట్: గ్రేటర్ 37వ వార్డు ఆశీపావీధి శ్రీ సత్య పోలమాంబ అమ్మవారిని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్ శనివారం దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆశీస్సులతో విజయం సాధిస్తానన్నారు. భవిష్యత్తులో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరిస్తానని స్థానిక కమిటీ పెద్దలకు హామీ ఇచ్చారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అనంతరం పలువీధుల్లో ప్రచారం చేశారు.

ఆశీర్వదించి గెలిపించండి.. అండగా ఉంటా..

» వైసీపీ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి కేకే రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 27: తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానని ఉత్తర నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కేకే రాజు అన్నారు. శనివారం సీతమ్మధార రైతుబజార్, ఆక్సిజన్ టవర్స్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి బ్రోచర్‌లను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధిని వివరించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మేజారిటీతో గెలిపించాలని కేకే రాజు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, సీతమ్మధారలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాల గేటు ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నుంచి విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మీతో పాటు కేకే రాజు ప్రచారం చేపట్టారు. 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్, బీఎస్ లేఅవుట్‌లలో ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, కోలా గురువులు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, చొక్కాకుల వెంకటరావు పాల్గొన్నారు.


సీతమ్మధారంలో వైసీపీ ఎంపీ అభ్యర్థినితో కలసి కేకే రాజు ప్రచారం

జిమ్‌ల్లో ప్రచారం

అక్కయ్యపాలెం : కేకే రాజు శనివారం అక్కయయ్యపాలెం ప్రధాన రహదారిలోని మారుతి జిమ్, మోహన్ జిమ్, ఇండియన్ జిమ్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు వారికి కరపత్రాలు పంపిణీ చేసిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ సింగ్, ఎం. సునీల్, అంబటి శైలేష్, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


అక్కయ్యపాలెంలో జిమ్‌లో నమస్కరిస్తున్న చేస్తున్న కేకే రాజు

శేఖరరావు స్మారక క్రికెట్ ట్రోఫీ పీఎం పాలెం సీసీ వశం


ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఏప్రిల్ 27: జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించిన డి.శేఖరరావు స్మారక క్రికెట్ టోర్నీ ట్రోఫీని పీఎం పాలెం సీసీ చాంపియన్ కైవసం చేసుకుంది. సీసీ విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో పీఎం పాలెం సీసీ ఐదు వికెట్ల తేడాతో సీసీ విశాఖపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీసీ విశాఖపట్నం 39.3 ఓవర్లలో 238 పరుగులు చేసింది. కేఎల్.శ్రీనివాస్ హాఫ్ సెంచరీ (63), రేవంత్ నాగకుమార్ (44) రాణించారు. పీఎం పాలెం బౌలర్లలో డి.రంజిత్‌కుమార్, పీవీ.శ్యాంకుమార్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పీఎం పాలెం సీసీ 27.4 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. రఖన్ (92) సెంచరీ మిస్సవగా, ఎస్.నూకరాజు హాఫ్ సెంచరీ (77) రాణించి జట్టుకు సునాయాస విజయన్నందించారు. సీసీ విశాఖ బౌలర్ పృధ్వీకుమార్ రెండు వికెట్లు తీశాడు.

నరసింహనగర్‌లో ఆక్రమణల తొలగింపు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27: రహదారి ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ ఎస్. అమ్మినాయుడు తోపుడు బండ్ల వ్యాపారులను హెచ్చరించారు. నరసింహనగర్, రైతుబజారు ఎదుట శనివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వజ్జపర్తి శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకులు వజ్జపర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన గంపా గోవింద్ రాజీనామా చేయడంతో ఈ స్థానంలో వజ్జపర్తి శ్రీనివాసరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నియమించారు. ఈ నియామకం పట్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు విజయమే లక్ష్యంగా పనిచేయ నున్నట్టు ఆయన తెలిపారు. పార్టీలో పదవులు అనుభవించి బయటకు వెళ్లిన నాయకులు.. పార్టీపై విమర్శలు చేయడం తగదన్నారు. పార్టీ నాశనానికి కారణమైన నాయకులు పార్టీని విమర్శించడం సిగ్గు చేటన్నారు.

నేడు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట, ఏప్రిల్ 27: వైజాగ్ రన్నర్స్ సొసైటీ యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పనకు ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఆర్‌కే బీచ్‌లో '5 కే రన్ ఫర్ ఓట్' అనే పేరిట ర్యాలీ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. నగరంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల భాగస్వామ్యంతో ఈకార్యక్రమం చేపడుతున్నామన్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి పామ్‌బీచ్ వరకు ఈ చైతన్య ర్యాలీ సాగుతుందన్నారు. మేధావులు, ఓటర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రణాళికతోనే వైద్య, విద్య రంగాల అభివృద్ధి


రోటరీ సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27: సరైన ప్రణాళిక, మార్గదర్శకంతో విద్య వైద్యం, ఆరోగ్య రంగాల అభివృద్ధి సాధ్యపడుతుందని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ముంబై మహారాష్ట్ర డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ సాయిశంకర లండా పేర్కొన్నారు. శనివారం రోటరీ ఇంటర్నేషనల్ విశాఖ ఆధ్వర్యంలో 'సామాజికం' సీఎస్సార్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ అతిథులుగా హాజరై పీడీజీ శ్యామ్‌మొవ్వ, సంజాయ్‌పర్‌మర్, ఆర్.వెంకటరమణ, రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌ఎన్ రావూరి సుబ్బారావు (దత్త)తో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. .కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం అధ్యక్షులు సీఏ డి.మధుసూదనరావుతోపాటు ఆర్.మెషినల్లి, రోటరీ కార్యదర్శి పీవీ రఘుపతి , ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల డీలర్ సస్పెన్షన్

మాధవధార, ఏప్రిల్ 27 ; విశాఖలో వాహనాలకు నకిలీ పేపర్లతో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ చేస్తు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించిన ట్రైస్టార్ డీలర్ రికగ్నైజేషన్ శనివారం సస్పెండ్ చేసినట్లు డీటీసీ జి.సి.రాజారత్నం తెలిపారు. విశాఖపట్నం సిటీలో ఉంటున్న వారికి అరుణాచల్ ప్రదేశ్‌లో నివాసం ఉంటున్నట్లు నివాస ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ఏపీ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగజేసినందున సదరు వాహనాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసిని ట్రైస్టార్ డీలర్ గుర్తింపుని సస్పెండ్ చేశారు.

వైసీపీ పాలనంతా అరాచకమే

» టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్


రక్తచరిత్ర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీతంరాజుసుధాకర్, నాయకులు

మహారాణిపేట, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనంతా అరాచకమే రాజ్యమేలిందని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజుసుధాకర్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ సాగించిన అరాచక పాలనపై తమ పార్టీ చార్జిషీట్ విడుదల చేసినట్టు చెప్పారు. ఇసుక మాఫియాతో భవన నిర్మాణ కార్మికులు కుదేలయ్యారని, మత్స్యకారులకు ఎటువంటి న్యాయంజరగలేదని ఆరోపించారు. కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణ, విల్లూరి భాస్కర రావు , నాయకులు వానపల్లి గాయత్రి, ఎర్నాకుల జగదీష్, విల్లూరి చక్రవర్తి, గనగళ్ల సత్యవతి డోకర రమణ, పొడుగు కుమార్ పాల్గొన్నారు.

అల్లిపురం: టీడీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన సీతంరాజు సుధాకర్‌ను 33వార్డు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ విల్లూరి తిరుమలాదేవి, విశాఖటీడీపీ పార్లమెంటరీపార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి కలసి సత్కరించారు

ప్రేమ పేరుతో మోసగించి యువకుడి అరెస్టు

కంచరపాలెం, ఏప్రిల్ 27: ప్రేమపేరుతో ఓ యువతిని మోసగించిన యువకుడిని కంచరపాలెం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి కొత్తపెంట గ్రామానికి చెందిన మరణ అజయ్‌కుమార్ (23) నగరంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతనికి కంచరపాలెం ప్రాంతానికి చెందిన రాణి (21)తో ఏడాది క్రితం పరిచయమైంది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో స్థానిక ధర్మానగర్‌లో సహజీవనం చేశాడు. పెళ్లి విషయం ప్రస్తావించడంతో అజయ్‌కుమార్ ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న రాణి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాలాపువానిపాలెంలో దారుణ హత్య


శ్రీనివాసరావు(ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 27: మండలంలోని గొటివాడ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పొలంలో మోటారు వేయడానికి వెళ్లిన అతడ్ని దారి కాసి ఇద్దరు యువకులు హతమార్చారు. వివాహేతర సంబంధమే కారణమని భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాసరావు(30)కు దువ్వాడ దరి మంగళపాలేనికి చెందిన భాగ్యలక్ష్మితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు లా వర్సిటీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి వచ్చాడు. రాత్రి 11 గంటలకు మోటారు వేసేందుకు పొలానికి వెళ్తుండగా ఇద్దరు యువకులు మంచం కోడుతో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనను సమీపంలోని ఉగ్గిన నూకాలమ్మ చూసి కేకలు వేసింది. దీంతో యువకులు అతడ్ని ఈడ్చుకు పోయారు. హతుడి తండ్రి అప్పారావు వెళ్లి చూడగా కాలువలో శ్రీనివాసరావు మృతదేహం కనిపించింది. వెంటనే పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. క్లూస్ బృందం వివరాలు సేకరించింది. మృత దేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యా ప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. కాగా మూడేళ్లుగా స్థానిక గల్లి రవికుమార్‌తో శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మి సన్నిహితంగా ఉంటోంది. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే హత్యకు కారణంగా భావిస్తున్నారు. నిందితులు రవికుమార్, గరికిపాటి హరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి

» తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి.అనిత

మురళీనగర్, ఏప్రిల్ 27; ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి. అనిత పేర్కొన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులతో మురళీనగర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాయకరావుపేట నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న తాను రాష్ట్రవ్యాప్త పార్టీ బాధ్యతల నేపథ్యంలో ముఖ్య నేతలను కలిసి కూటమి విజయానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఐదేళ్లపాటు నేరస్తుని చేతిలో రాష్ట్రాన్ని పెట్టిన జనం ఇపుడు పునరాలోచించి నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందని అనిత పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల తీర్పు కూటమికి గెలుపు అందిస్తుందని తాను నమ్ముతున్నానన్నారు.


సమావేశంలో అనితతో సనపల.వరప్రసాద్ తదితరులు

టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సనపల.వరప్రసాద్ వంగలపూడి.అనిత శాసనసభలో తన స్వరం బలంగా వినిపించే సమర్థత ఉన్న తెలుగు మహిళ నేత అని కొనియాడారు. నాయకులు విజయరామరాజు, జనార్ధన్, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి

భోరుమన్నారు. తీవ్రంగా గాయపడిన వికాస్ ఇంజనీరింగ్ చదివాడు. రెండు నెలల్లో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు అతని తండ్రి నరసింగరావు చెప్పారు. తన జీవిత భాగస్వామి వెంకటలక్ష్మి కారులో రక్తపు మడుగలో నిర్జీవంగా ఉన్న దృశ్యాన్ని చూసి ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదానికి గురైన వారంతా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు బంధువులు కావడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనసేన నేత గెడ్డం బుజ్జి నక్కపల్లి ఆస్పత్రికి వచ్చి మృతుల బంధువులను పరామర్శించారు. మృతదేహాలకు నక్కపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

తుస్...!

... 5వ పేజీ తరువాయి

కాలంలో పొందిన లబ్ధి, వచ్చే ఐదేళ్లలో చేయబోయే సాయం కలిపి..మొత్తం పదేళ్లకు తాను ఎంత ఇవ్వబోతున్నదీ జగన్మోహన్‌రెడ్డి లెక్కలు వేసి వివరించారు. ఉదాహరణకు మత్స్యకారులకు భరోసా కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున గత నాలుగేళ్లలో రూ.40 వేలు ఇచ్చారు. ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. రాబోయే ఐదేళ్లలో మరో రూ.50 వేలు ఇస్తామని, తద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష రూపాయలు అవుతుందని,లబ్ధి రెట్టింపవుతుందంటూ జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు చెప్పారు. చేయూత, అమ్మఒడి అన్ని పథకాలకుఇలాగే పదేళ్ల లెక్కలు వేసి రెట్టింపు చూపించారు.

చందనోత్సవం నాడు అంతరాలయ దర్శనాలు రద్దు

... 5వ పేజీ తరువాయి

40 సాధారణ బస్సులు, 40 మినీ బస్సులను మాత్రమే ఘాట్ రోడ్డులో రాకపోకలకు అనుమతిస్తామని చెప్పారు. టికెట్లు రీ సేల్ జరగకుండా ప్రతి టికెట్‌ను రెండు సార్లు పంచింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, బార్ కోడ్ తప్పనిసరిగా ఉంటుందన్నారు. బయటకు వెళ్లే మార్గం నుంచి ఎవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య దేవాలయ సిబ్బందికి ప్రత్యేక దర్శనాలకు అనుమతిస్తామని, 4 నుంచి 5 వరకు దివ్యాంగులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. రూ.1,500 టికెట్లు గతంలో కంటే తక్కువగా ముద్రించాలని నిర్ణయించామని, అవసరమైతే తదుపరి నిర్ణయం మేరకు 7 వేల కంటే తక్కువకు తగ్గిస్తామన్నారు. చందనోత్సవం టికెట్లను వచ్చే నెల రెండో తేదీ నుంచి విక్రయించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్, అడిషినల్ సీపీ ఫకీరప్ప, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అదానీ పోర్టు శ్రమ దోపిడీ

... 5వ పేజీ తరువాయి

శనివారం విశాఖపట్నం వచ్చారు. గంగవరం పోర్టు కార్మిక సంఘాల ప్రతినిధులను చర్చల నిమిత్తం నగరంలోని కార్మిక శాఖ అధికారి కార్యాలయానికి పిలిచారు. యాజమాన్యం తరఫున ఒక అధికారి హాజరయ్యారు. సమ్మె చేస్తున్నది వీరు కాదని, నిర్వాసిత కార్మికులని ఆ అధికారి పేర్కొన్నారు. దీంతో చర్చలకు హాజరైన కార్మికుల్లో పలువురు లేచి, తమకు అన్ని అర్హతలూ, నైపుణ్యం ఉన్నా కనీస వేతనాలివ్వడం లేదని, తమకూ వేతనాలు పెంచాలని కోరారు. నిర్వాసిత కార్మికుల సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. దీంతో పోర్టు ప్రతినిధి లేచి.. ఈ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు తనకు యాజమాన్యం అనుమతి ఇవ్వలేదని బయటకు వెళ్లిపోయారు.

ఎవరికైనా రూ.15 వేలే జీతం..

కార్మిక శాఖ అధికారి కార్యాలయానికి వచ్చిన పోర్టు కార్మికులు మాట్లాడుతూ.. నిర్వాసిత కార్మికులు తోట పని, క్లీనింగ్, కొందరు కలాసీలుగా చేస్తారని, తాము మాత్రం యాజమాన్యం పెట్టిన పరీక్షలు పాసై విధుల్లో చేరామని చెప్పారు. 15 ఏళ్ల నుంచి చేస్తున్నా, ఇంకా రూ.15 వేలు మాత్రమే జీతంగా ఇస్తున్నారని చెప్పారు. జీతం పెంచాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసిత కార్మికుల సమ్మెకు తాము కూడా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఉత్తరాది నుంచి వచ్చిన వారికే పోర్టులో ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఇక్కడి వారికి శ్రమ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

కార్మికులకు నోటీసులు

సమ్మె చేస్తున్న నిర్వాసిత కార్మికుల నాయకులను నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ శనివారం చర్చలకు పిలిచారు. మొత్తం 12 మంది నాయకులు రాగా వారితో చర్చించారు. ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోవడానికి తమకు మనిషికి రూ.35 లక్షలు ఇవ్వాలని వారు కోరగా, పోర్టు యాజమాన్యంతో మాట్లాడి రూ.25 లక్షల వరకు ఇప్పించగలమని కమిషనర్ హామీ ఇచ్చారు. అంత తక్కువైతే తాము సమ్మెలోనే ఉంటామని నాయకులు చెప్పారు. దీంతో వారందరికీ న్యూపోర్టు పోలీస్ స్టేషన్ అధికారితో 41-ఏ నోటీసులు ఇప్పించారు. తాము ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని, ఎటువంటి ఆందోళనలు చేయకూడదని చెప్పి పంపించారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులకు 1 వరకు గడువు పొడిగింపు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 27 : ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు అందజేయడానికి మే 1 వరకు గడువు పొడిగిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసింది. కానీ చాలామంది సకాలంలో దరఖాస్తులు చేయలేకపోవడంతో గడువు పొడిగించమని కోరారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రశాంతంగా పాలిసెట్

భీమునిపట్నం, ఏప్రిల్ 27 : పట్టణంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, గురుకుల బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, సెడార్ హైస్కూల్, సెడార్ ప్రైమరీ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 1043 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 951 మంది హాజరయ్యారు.

ఫార్మశీ కళాశాల వసతి గృహం కార్యాలయం పరిశీలన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 : ఏయూ ఫార్మశీ కళాశాల వసతి గృహం కార్యాలయాన్ని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి శనివారం సందర్శించారు. కార్యాలయం నిర్వహణ, రికార్డుల ఏర్పాటు, ఆటోమేషన్, డైలీ రిపోర్టు, మెయింటెనెన్స్ తదితర అంశాలను పరిశీలించారు. వసతి గృహం ఆదాయం, ఖర్చుల వివరాలు చీఫ్ వార్డెన్ ఆచార్య పవార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై. రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు

పద్మనాభం, ఏప్రిల్ 27 : ఎన్నికల్లో పోలింగ్‌కు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మధురవాడ నార్త్ జోన్ ఏసీపీ బి. సునీల్ హెచ్చరించారు. బీఆర్ తాళ్లవలస, గెద్దపేటలో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గొడవలు చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులోసీఐ సీహెచ్ శ్రీధర్, ఎస్సై శ్రీనివాసరావు, సురేష్, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు పైడినాయుడు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయం కిటకిట

సింహాచలం, ఏప్రిల్ 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు శనివారం తరలివచ్చారు. వేకువజామున సుప్రభాత సేవ నుండే ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి సింహగిరికి చేరుకుని తలనీలాల సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాలపై ఆరా

సాగర్‌నగర్, ఏప్రిల్ 27 : ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సిపి ఫకీరప్ప శనివారం రుషికొండ, వాడపాలెంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల అధికారులు ఏర్పాటు చేసిన సదుపాయాలు, సీసీ కెమెరాలు, తదితర వాటిని పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యలు గురించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

చందనోత్సవం సహస్ర ఘటాభిషేకానికి శ్రీవైష్ణవ స్వాములకు ఆహ్వానం

సింహాచలం, ఏప్రిల్ 27 : సింహగిరిపై వచ్చే నెల 10న జరిగే అప్పన్న చందనోత్సవం రోజున నిర్వహించాల్సిన సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు అర్హులైన శ్రీవైష్ణవ స్వాముల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 5వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని చెప్పారు.

ఎస్ఎస్‌టీ బృందాల పనితీరు పరిశీలన

సిరిపురం, ఏప్రిల్ 27 : ఎస్ఎస్‌టీ బృందాల పనితీరును విశాఖ పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రెంగరాజన్ పరిశీలించారు. శనివారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బృందాలు చేపడుతున్న చర్యలను గమనించారు. పౌరుల పట్ల గౌరవప్రదంగా ఉండాలని, వారికి అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బాయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 25, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 20, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 32, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 3 లో..



కొమ్మాది జంక్షన్ వద్ద గంటాకు గజమాలతో స్వాగతం



ఎండాడలో ప్రచార సభ వేదికపై గంటా శ్రీనివాసరావు, శ్రీభరత్



గంటాకు జై కొడుతున్న మహిళలు

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన

భీమిలి కూటమి అభ్యర్థి గంటా

కొమ్మాది, ఏప్రిల్ 27 : అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ఏకకాలంలో అమలు చేసే సత్తా ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు అని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఆరో వార్డు కొమ్మాది జంక్షన్ మూడుగుళ్ల వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిచారు. కొమాది జంక్షన్, మూడు గుళ్ల, రిక్షా కాలనీ, హెచ్‌బీ కాలనీ, దేవీమెట్ట, కొమ్మాది, అమరావతి కాలనీలో పర్యటించారు. కొమ్మాది జంక్షన్ వద్ద టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్ ఆధ్వర్యంలో నాయకులు భారీ గజమాలతో గంటాకు, ఆయన తనయుడు రవితేజకు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా పలు సభల్లో గంటా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రూ. 3800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుత వైసీపీ పాలనలో అభివృద్ధి అన్న మాట ఎక్కడా వినిపించడం లేదన్నారు. వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో కొత్తదనం ఏమీ లేదని,గత ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలకు వ్యతిరేకం కాదని, ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రజలకు పరిచయం చేసింది ఎన్టీ రామారావు అని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత చంద్రబాబునాయుడు కియా వంటి అనేక ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకువచ్చి ఆదాయం పెరిగేలా చేశారని కొనియాడారు. వైసీపీ కొత్తగా పరిశ్రమలు తీసుకురాకపోగా ఉన్న వాటిని తరిమేశారని ఆరోపించారు. అప్పులు చేసి, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి సంక్షేమ పథకాలు అమలు చేశారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని ప్రగల్భాలు పలికి జగన్ నేడు ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. చిన్న రాష్ట్రాలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తరుణంలో ఏపీ మాత్రం అట్టడుగున ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇటీవల వైసీపీలో చేరిన కె1 కాలనీవాసులు తిరిగి గంటా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త తలశిల విజయ్‌మోహన్, టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గరె గురునాథ్, గొలగాని సన్యాసిరావు, గొల్లంగి ఆనందబాబు, రెడ్డి సత్యనారాయణ, లొడగల జానకీరామ్, పోతిన రఘు, జనసేన నాయకులు సంతోష్‌నాయుడు, బీజేపీ నాయకుడు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు విధ్వంస పాలన

సాగర్‌నగర్ : వైసీపీ రాష్ట్రంలో ఐదేళ్లు విధ్వంసకర పాలన సాగించిందని కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, రుషికొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని చెప్పి అరచేతిలో స్వర్గం చూపి అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత ఎవరైనా మంచి కార్యక్రమంతో పాలన మొదలు పెడతారని, కానీ జగన్ ప్రజా వేదిక కూల్చివేతతో పాలన మొదలుపెట్టారని విమర్శించారు. విధ్వంసకరమైన ఈ నిర్ణయంతో ఐదేళ్లు కూడా అదే పరంపర సాగిందన్నారు.తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సాగర్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సాగర్‌నగర్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

మద్దిలో గంటా రవితేజ ప్రచారం

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో గంటా కుమారుడు రవితేజ ప్రచారం చేశారు. ముందుగా పద్మనాభంలోని కుంతీమాధవస్వామిని దర్శించుకొని పూజలు చేసిన అనంతరం బైక్ ర్యాలీతో మద్ది జంక్షన్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం జంక్షన్ నుంచి గ్రామమంతా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం రవితేజ ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. విలాస్‌ఖాన్‌పాలెం, తునిపాలెం గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మ, టీడీపీ మహిళా నాయకురాలు స్రవంతి,టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, వాసు పాల్గొన్నారు.

వైసీపీకి మించి సంక్షేమం

ఎండాడ : కూటమి అధికారంలోకి రాగానే వైసీపీని మించిన సంక్షేమం అందిస్తామని, పథకాల అమలులో టీడీపీకి 40 ఏళ్ల ట్రాక్ రికార్డు ఉందని భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన 8వ వార్డులోని గణేష్‌నగర్, శాంతినగర్, రాజీవ్‌నగర్, గొల్లల ఎండాడ, ఎస్ఎల్‌పీ లేఅవుట్, ఎండాడ ప్రధాన గ్రామం, ఎండాడ బీసీ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలనే వైసీపీ మేనిఫెస్టోలో పెట్టిందని, అంతకుమించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు.

వంద శాతం పోలింగ్ లక్ష్యం

పెదవాల్తేరు, ఏప్రిల్ 27 : తూర్పు నియోజకవర్గంలో వంద శాతం పోలింగ్ జరిగేలా ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆర్‌ఓ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన బీచ్ రోడ్డు ఉడా పార్కులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను ఓటర్లు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, స్వీప్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జూపార్కుకు కొత్తగా రెండు జిరాఫీలు



ఆరిలోవ. ఏప్రిల్ 27 : నగరంలోని జూపార్కుకు శనివారం కొత్తగా రెండు జిరాఫీలు వచ్చాయి. కోల్‌కత్తాలోని అలీపూర్ జూలాజికల్ పార్కు నుంచి వీటిని తీసుకువచ్చినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారీయా తెలిపారు. వాటితో పాటు ఆరు కొత్త జంతువులను కూడా తీసుకువచ్చారు. ప్రస్తుతం వాటిని 40 రోజుల పాటు క్వారంటైన్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అనంతరం సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత విద్య

మద్దిలపాలెం, ఏప్రిల్ 27 : కంచి కామకోటి ఘటిక స్థానం సారథ్యంలో బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్టు కాంచిపురం చంద్రశేఖర్ విశ్వ మహా విద్యాలయం ఉప కులపతి డాక్టర్ జె. శ్రీనివాస్ చెప్పారు. శనివారం ఆయన మద్దిలపాలెంలో ఉచిత విద్యకు సంబంధించి కంచి కామకోటి ఘటిక స్థానం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణ విద్యార్థులకు ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచిత వసతి కల్పించి, విద్య అందిస్తున్నామన్నారు. ఒకపూట ఆంగ్ల విద్య, మరోపూట వేదం, స్మార్తం, ఆగమం, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు బోధిస్తారన్నారు. ఈ విషయమై కంచి కామకోటి శంకర మఠంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు.

మండుటెండలో వ్యాపారుల పాట్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 : అసలే వేసవి..పైగా మండిపోతున్న ఎండల్లో మునిసిపల్ మార్కెట్ పునర్నిర్మాణ పనులను ప్రారంభించడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. 3వ వార్డు గంటస్తంభం వద్ద ఉన్న మునిసిపల్ లాల్‌బహదూర్‌శాస్త్రి చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణానికి గత నెల 29న రూ. 1.49 కోట్ల జీవీఎంసీ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ పనులను కొన్ని రోజుల క్రితం ప్రారంభించారు. మొదట చేపల మార్కెట్ షెడ్లు తొలగించిన అధికారులు, రెండు రోజుల్లో కూరగాయల మార్కెట్ షెడ్‌లను కూడా తొలగించే ఆలోచనతో వ్యాపారులను శనివారం అక్కడి నుంచి ఖాళీ చేయించి,గంట స్తంభం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశానికి తరలించారు. అక్కడ వ్యాపారులకు ఎనిమిది పగోడాలు ఏర్పాటు చేశారు. అయితే ఎండల తీవ్రతకు వ్యాపారులు పగోడాల్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. పై నుంచి వేడి, కింద సీసీ గచ్చుపై కాలిపోతుండడంతో నరకం చూస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గడపగడపకు వైసీపీ మేనిఫెస్టో

కార్యకర్తలకు ముత్తంశెట్టి పిలుపు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 : వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకువెళ్లాలని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆయన తన క్యాంప్ కార్యాలయంలో భీమిలి మండల పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌లా, ఖురాన్‌లా పవిత్రంగా భావించి అమలు చేసింది ఒక్క వైసీపీ ప్రభుత్వమేనని, ప్రతి కార్యకర్త ఈ విషయాన్ని గర్వంగా చెప్పుకోవాలన్నారు. గతంలో మేనిఫెస్టోలు ఎన్నికల సమయంలోనే ఆకర్షణీయమైన రంగులతో కనిపించేవని,అధికారంలోకి వచ్చాక అమలయ్యేవి కాదన్నారు. తొలిసారిగా సీఎం జగన్ మాత్రమే మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలను అమలు చేశారని చెప్పారు. ఈ మేనిఫెస్టోను కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా అమలు చేస్తామని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అలాగే పోలింగ్ బూత్ ఏజెంట్ ప్రతి ఓటరును స్వయంగా కలిసి గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, కొత్తగా రూపొందించిన మేనిఫెస్టోలోని అంశాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ప్రతి ఓటరును అభ్యర్థించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, సీనియరు నాయకులు దాట్ల పెదబాబు, యలమంచిలి సూర్యనారాయణ, గాదు శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీవానిపాలెంలో ఎన్నికల ప్రచారం

కొమ్మాది : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగించారని భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పీఎంపాలెం, లక్ష్మీవానిపాలెంలో పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంకతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మైనారిటీ వర్గాలకు పెద్దపీట వేయడమే కాకుండా రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా సంతోషంగా ఉండాలన్న ఆలోచనతో సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. మిగిలిన పార్టీలు బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తుండగా తాము మాత్రం వారికి అధికారం కల్పించి, సామాజిక న్యాయం దిశగా సాగుతున్నామని చెప్పారు. ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా, ప్రయత్నాలు చేసినా వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. గత పాలనకు ప్రస్తుత పాలనకు తేడా గమనించాలన్నారు. ప్రజలు తమకు నిత్యం అందుబాటులో ఉండే తాను కావాలా లేక ఎన్నికల తరువాత కనిపించని నాయకులు కావాలో ఆలోచించాలన్నారు. వైసీపీ మేనిఫెస్టో తుస్సుమందో లేక బుల్లెట్ దూసుకుపోతుందో జూన్ 4 తరువాత తెలుస్తుందన్నారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక మాట్లాడుతూ ముత్తంశెట్టి శీనివాసరావును మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతిన ప్రసాదు, వైసీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, సంజీవ్,పిల్లా రమణ, గాదె రోసిరెడ్డి, సియ్యాద్రి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీవానిపాలెంలో శ్రీనివాసరావుకు హారతి పడుతున్న మహిళ

చందనోత్సవంలో పరోక్షంగా అష్టోత్తర శతనామార్చన సేవ

సింహాచలం, ఏప్రిల్ 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు అవకాశం లేని భక్తుల కోసం పరోక్షంగా అష్టోత్తర శతనామార్చన సేవను ఈఏడాది కొత్తగా అమలు చేస్తున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి ప్రకటించారు. పరోక్ష సేవలో పాల్గొనే భక్తులు రూ.1116 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా టికెటు కొనుగోలు చేసి, అందులోనే గోత్రనామాలు రాయాలన్నారు. నూతన పరోక్ష సేవా తొలి టికెటును కలెక్టర్ మల్లికార్జున శనివారం సాయంత్రం కొనుగోలు చేయగా దాన్ని ఈఓ కలెక్టర్‌కు అందజేశారు. పరోక్ష సేవ టికెట్ల గోత్రనామాలను వచ్చే 10న ఉత్సవం రోజున ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేకంగా స్వామి సమక్షంలో వైదికులు చదువుతారని చెప్పారు. భక్తులకు ఒలుపు చందన ప్రసాదం, ప్రసాదాలను ఆన్‌లైన్ ద్వారా అందజేస్తామని తెలిపారు.

'బొత్స విమర్శలు అర్థరహితం'

పెదవాల్తేరు, ఏప్రిల్ 27 : రైల్వే జోన్‌ను విశాఖకు తీసుకురావాలన్న చిత్తశుద్ధి వైసీపీ ప్రభుత్వానికి లేదని, రాజకీయ లబ్ధి కోసమే వాస్తవాలు పక్కదారి పట్టిస్తున్నారని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. శనివారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి బొత్స జోన్ విషయమై కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను విమర్శించడం సరికాదని, ఆయన విమర్శలు అర్థరహితమని పేర్కొన్నారు. విశాఖలో బీఆర్‌టీఎస్ రహదారి కోసం ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న రైల్వే భూములను తీసుకుని ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ రిజర్వాయర్ దగ్గర 52. 20 ఎకరాలు ఇచ్చామని బొత్స చెప్పడం అవాస్తవమన్నారు.ముడసర్లోవ ప్రాంతంలో కేటాయించిన భూమి కోర్టు వివాదంలో ఉన్న విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రం అనేకసార్లు జోన్ ఏర్పాటు కోసం భూమి అడిగినా కేటాయించకుండా తాత్సారం చేశారని ఆరోపించారు.



15వ వార్డులో కూటమి నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న వెలగపూడి రామకృష్ణబాబు

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

తూర్పు కూటమి అభ్యర్థి వెలగపూడి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 : రాష్ట్రంలో సైకో పాలన పోయి, అందరి సంక్షేమానికి కృషి చేసే టీడీపీ ప్రభుత్వం రావాలని, దీనికి ప్రజలు ఓటుతో సహకరించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. శనివారం సాయంత్రం ఆయన 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కసారి నమ్మి ఎంపీగా గెలిపించిన కబ్జారాయుడు నగరంలోని ఏ ప్రాంతాన్నీ వదలకుండా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, గెలిచిన ఐదేళ్లలో ఒక్కరోజు కూడా ప్రజలకు ముఖం చూపలేదని విమర్శించారు. మళ్లీ ఎన్నికలకు వచ్చి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ ఓట్లు అడుక్కోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమాన్ని కోరి, నిరంతరం అందుబాటులో ఉండే తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, నరేంద్ర, గోవింద్, దామోదర్, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరిలోవ : టీడీపీని గెలిపించాలని వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ కోరారు.ఆయన పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.



సీబీఐ ఆఫీసు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న సుజన

పెదవాల్తేరు : తూర్పు నియోజకవర్గం ప్రజలంతా వెలగపూడి రామకృష్ణబాబుకు అండగా ఉండాలని వెలగపూడి సతీమణి సుజన కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె సీబీఐ, త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పద్మజ, సీతా మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక సుమా, పీతల అఖిల్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

తూర్పు వైసీపీ అభ్యర్థి సత్యనారాయణ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 : ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటానని, తనను ఆశీర్వదించాలని పార్టీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అభ్యర్థించారు. శనివారం సాయంత్రం ఆయన కొత్త వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌కి ప్రజలు ఒక కన్ను అయితే, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరో కన్ను అని, నిరంతరం ఈ రెండు కళ్ల సంక్షేమానికే ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం విద్యావ్యవస్థలో ప్రథమ స్థానంలో నిలిచిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని గుర్తు చేశారు. విద్యా, వైద్య రంగాల్లో జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, సచివాలయం వ్యవస్థ ద్వారా అర్హులకు పథకాలు అందించారని కొనియాడారు. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని చెప్పారు. నామినేషన్ ర్యాలీని విజయవంతం చేసినందుకు ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేశారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు కూటమిని తరిమికొట్టే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. విశాఖ మరింతగా అభివృద్ధి చెందాలన్నా, పరిపాలనా రాజధాని కావాలన్నా ప్రతిఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.పిల్లల చదువు గురించి గతంలో ఏ పాలకులు పట్టించుకోలేదని, పేదరికం నుంచి బయట పడాలంటే వైసీపీ ప్రభుత్వమే తిరిగి రావాలని చెప్పారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, గొలగాని శ్రీను, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పేర్ల విజయచంద్ర, గుడ్ల సత్యారెడ్డి,గోపాలపురం పరిశీలకుడు వెంకటేశ్వరరావు, బోణి శివరామకృష్ణ, అల్లంపల్లి రాజాబాబు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

పేట... దేశం కంచుకోట

నియోజకవర్గానికి ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు

- అత్యధికంగా ఏడు సార్లు విజయం సాధించిన టీడీపీ
- మూడు పర్యాయాలు కాంగ్రెస్
- రెండు పర్యాయాలు వైసీపీ
- సీపీఐ ఒకసారి గెలుపు

ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన పోరాటయోధుడు జగన్నాథ పాయకరావు పేరు మీద ఏర్పడిన పాయకరావుపేట స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జనరల్ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పట్లో మద్రాస్ సంయుక్త రాష్ట్రంలో ఉన్న ఈ నియోజకవర్గానికి పాయకరావుపేట మండలం గుంటపల్లికి చెందిన గెడ్డం సన్యాసిరావు శాసనసభ్యునిగా పనిచేశారు. ఆ తరువాత 1952లో జరిగిన ఎన్నికల్లో ఆర్.సాగిసూర్యనారాయణరాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1962లో పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా మారింది. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ 15 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా ఏడుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ (ఐ) ఒక్కొక్కసారి గెలుపొందాయి. ఒకసారి ఇండిపెండెంట్ గెలుపొందారు.



పాయకరావుపేట పట్టణం



ఆర్ఎస్ఎస్.రాజు



మారుతి ఆదియ్య



గెడ్డం సన్యాసిరావు



గంటెల సుమన



కాకర నూకరాజు



చెంగల వెంకట్రావు

ఫ్లాష్ బ్యాక్
పాయకరావుపేట నియోజకవర్గం

పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ పరిశీలిస్తే 1962లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరపున పోటీ చేసిన మండే పిచ్చియ్య...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.పోతురాజుపై గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గంట్లాన సూర్యనారాయణ ఇండిపెండెంట్ అభ్యర్థి బి.నాగభూషణంపై విజయం సాధించారు. అదేవిధంగా 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున రెండోసారి పోటీ చేసిన గంట్లాన సూర్యనారాయణ...మరోమారు ఇండిపెండెంట్ అభ్యర్థి బి.నాగభూషణంపై గెలుపొందారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన మారుతి ఆదియ్య...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గారా చిననూకరాజుపై గెలుపొందారు.



గొల్ల బాబూరావు



వంగలపూడి అనిత

1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ వర్గాలు మద్దతుగా నిలిచాయి. దీంతో 1983 నుంచి 2004 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ వరుసగా ఆరుసార్లు విజయాలు సాధించింది. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గంటెల సుమన...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్.నీలపర్తిపై విజయం సాధించారు. అలాగే 1985 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన కాకర నూకరాజు...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవీ హర్షకుమార్‌పై, 1989లో టీడీపీ తరపున రెండోసారి పోటీ చేసిన కాకర నూకరాజు కాంగ్రెస్ తరపున బరిలోకి దిగిన గంటెల సుమనపై విజయం సాధించారు. అలాగే 1994లో మూడోసారి టీడీపీ తరపున పోటీ చేసిన కాకర నూకరాజు మరోమారు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గంటెల సుమనపై విజయం సాధించారు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సినీ నిర్మాత చెంగల వెంకట్రావు...కాంగ్రెస్ పార్టీ తరపున మూడోసారి పోటీ చేసిన గంటెల సుమనపై విజయం సాధించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కూడా టీడీపీ, కాంగ్రెస్ తరపున వీరిద్దరే పోటీపడగా చెంగల వెంకట్రావును విజయం వరించింది. ఇక నియోజకవర్గాల పునర్విభజనలో కాంగ్రెస్‌కు పట్టున్న కోటవురట్ల మండలాన్ని నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 'పాయకరావుపేట'లో చేర్చింది. దీంతో టీడీపీ జైత్రయాత్రకు బ్రేకు పడింది. 2009 ఎన్నికల్లో టీడీపీ తరపున మూడోసారి చెంగల వెంకట్రావు బరిలోకి దిగగా, కాంగ్రెస్ పార్టీ తరపున గొల్ల బాబూరావు, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా జి.ధనరాజ్ పోటీ చేశారు. త్రిముఖ పోటీలో గొల్ల బాబూరావు స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆ తరువాత వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరిన గొల్ల బాబూరావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో 2012లో ఉప ఎన్నిక వచ్చింది. వైసీపీ తరపున గొల్ల బాబూరావు పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చెంగల వెంకట్రావుపై విజయం సాధించారు. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన వంగలపూడి అనిత...వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెంగల వెంకట్రావుపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన గొల్ల బాబూరావు టీడీపీ అభ్యర్థి డాక్టర్ బి.బంగారయ్యపై విజయం సాధించారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి ఎస్.రాయవరం మండలానికి చెందిన కాకర నూకరాజు 1985, 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ తరపున వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. ఇప్పటివరకూ ఆయన రికార్డును ఎవరూ బ్రేక్ చేయలేకపోయారు.

మరోసారి టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ

వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు పోటీలో ఉన్నారు. ఇంకా పార్టీల నుంచి అభ్యర్థులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నా టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ జరగనున్నది. 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందిన వంగలపూడి అనిత 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆమె పోటీ చేయబోతున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి అయిన కంబాల జోగులు 2004 ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున రాజాం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి రెండుసార్లు గెలుపొందారు. ఇప్పుడు పాయకరావుపేట నుంచి బరిలోకి దిగారు.

● పాయకరావుపేట

1952లో పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ జరిగిన ఎన్నికల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు	విజేత మెజారిటీ
1952	ఆర్ఎస్ఎస్ రాజు	ఇండిపెండెంట్	9,757	ఎస్.ఎ.నాయుడు	కాంగ్రెస్	5,737	4,020
	ఎస్సీ నియోజకవర్గంగా	ఏర్పడిన తరువాత నుంచి..					
1962	మండే పిచ్చియ్య	సీపీఐ	13,464	ఎం.పోతురాజు	కాంగ్రెస్	11,379	2,085
1967	జి.సూర్యనారాయణ	కాంగ్రెస్	13,804	బి.నాగభూషణం	ఇండిపెండెంట్	12,165	1,639
1972	జి.సూర్యనారాయణ	కాంగ్రెస్	21,844	బి.నాగభూషణం	ఇండిపెండెంట్	3,588	18,256
1978	మారుతి ఆదియ్య	కాంగ్రెస్(ఐ)	29,490	జీసీ.నూకరాజు	కాంగ్రెస్	14,023	15,467
1983	గంటెల సుమన	టీడీపీ	34,090	ఆర్.నీలపర్తి	కాంగ్రెస్	10,252	22,778
1985	కాకర నూకరాజు	టీడీపీ	42,821	జీవీ హర్షకుమార్	కాంగ్రెస్	13,053	28,769
1989	కాకర నూకరాజు	టీడీపీ	38,764	గంటెల సుమన	కాంగ్రెస్	35,486	3,278
1994	కాకర నూకరాజు	టీడీపీ	39,666	గంటెల సుమన	కాంగ్రెస్	35,657	4,009
1999	చెంగల వెంకట్రావు	టీడీపీ	46,478	గంటెల సుమన	కాంగ్రెస్	38,902	7,576
2004	చెంగల వెంకట్రావు	టీడీపీ	40,794	గంటెల సుమన	ఇండిపెండెంట్	27,105	13,689
2009	గొల్ల బాబూరావు	కాంగ్రెస్	50,698	చెంగల వెంకట్రావు	టీడీపీ	50,042	656
2012	గొల్ల బాబూరావు	వైసీపీ	71.963	చెంగల వెంకట్రావు	టీడీపీ	57,601	14,362
2014	వంగలపూడి అనిత	టీడీపీ	86,355	చెంగల వెంకట్రావు	వైసీపీ	83,527	2,828
2019	గొల్ల బాబూరావు	వైసీపీ	98,745	బి.బంగారయ్య	టీడీపీ	67,556	31,189

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

ఓటరు మాట



ప్రమాదంలో ప్రజాస్వామ్యం



సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అసమానతలు పెరిగిపోతున్నాయి. మహిళలకు భద్రత లేకుండా పోయింది. నేరాలకు పాల్పడిన వారికి తగిన శిక్ష పడడంలేదు. అన్ని వర్గాలు ప్రమాదంలో ఉన్నాయి. ప్రభుత్వాలు ఓట్ల రాజకీయమే తప్ప సమాజంలో పెనుసవాళ్లను పట్టించుకోవడం లేదు. ఓటర్లు కళ్లు తెరవాలి. ఆధునిక భావాలు కలిగిన వారిని చట్ట సభలకు పంపాలి. ప్రలోభాలకు లొంగకపోతే మంచి ప్రభుత్వాలు ఏర్పడతాయి.

- డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, స్పెక్ట్ చైర్‌పర్సన్, ఎన్ఏడీ

సంపదను సృష్టించగలగాలి



రాష్ట్రాభివృద్ధికి సంపద సృష్టించగల ప్రభుత్వం కావాలి. అప్పులుచేసి నెట్టుకొస్తే అది మన జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. విజన్ ఉన్న నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుంది. ఇలాంటి నేతలకు ఓటు వేస్తేనే సమాజానికి మేలు.

- బీహెచ్ అప్పారావు, అనకాపల్లి

వసతులు కల్పించాలి



రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి. పారిశ్రామికీకరణతో పాటు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. అలాంటి సత్తా ఉన్న నాయకులను ఎన్నుకోవాలి.

- కొర్రా కృష్ణారావు, పెదబయలు

1955లో స్వతంత్రులదే హవా!

ఇండిపెండెంట్లకు పట్టం కట్టిన జిల్లా

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు రంగంలో ఉన్నప్పటికీ స్వతంత్రులుగా పోటీచేసిన ఎంతోమందిని చట్టసభలకు పంపిన చరిత్ర విశాఖ జిల్లాకు ఉంది. రాష్ట్రంలో 1955లో పూర్తిస్థాయి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఇతర జిల్లాలకు భిన్నంగా విశాఖపట్నం జిల్లాలో అనేక నియోజకవర్గాలలో ఇండిపెండెంట్లు జయకేతనం ఎగరవేశారు. ఈ రికార్డు ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ నమోదు కాలేదు. అప్పటి అసెంబ్లీలో 196 సీట్లుండగా వాటిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి 119 సీట్లు వచ్చాయి. కృషీకార్ లోక్‌పార్టీకి 22, సీపీఐకు 15, ప్రజా సోషలిస్టుపార్టీకి 13, ప్రజాపార్టీకి 5 సీట్లు రాగా ఇండిపెండెంట్లు 22 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఎనిమిది మంది విశాఖ జిల్లా నుంచే గెలుపొందడం విశేషం. అప్పటి ఎన్నికల సమయంలో ఒక నియోజకవర్గానికి ఇద్దరేసి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించేవారు. ఒకరే ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గాలూ ఉండేవి. ఆ ఎన్నికల సమయానికి గూడెం, కణితి, కొండకర్ల, గొలుగొండ, రేవిడి, నియోజకవర్గ కేంద్రాలుగా ఏండువి. ఆ తర్వాత కాలంలో వాటిని పక్క నియోజకవర్గాలలో విలీనం చేశారు.



సత్తాచాటిన ఇండిపెండెట్లు

ఆనాటి విశాఖ జిల్లాలో అనేక నియోజకవర్గాలలో ఇండి పెండెంట్లు గెలుపొందారు. గూడెం నియోజకవర్గంలో మత్స్యరాజు మత్స్యరాజు కృషీకార్ లోక్‌పార్టీ నాయకుడు కాద పెన్నయ్యపై గెలుపొందారు. ఇతనికి 3,880 ఓట్లు రాగా పెన్నయ్యకు 2,066 ఓట్లు వచ్చాయి. గొలుగొండ నియోజకవర్గంలో రుత్తల లచ్చాపాత్రుడు 13,932 ఓట్లు తెచ్చుకుని గెలుపొందారు ఇతనిపై పోటీ చేసిన కృషీకార్‌లోక్ పార్టీ అభ్యర్థి పాసపు తమ్మునాయుడుకు 7,826 ఓట్లు వచ్చాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలూ ఇండిపెండెంట్లే జాతీయ పార్టీల అభ్యర్థులను ఓడించారు. ఒకరు రాజాసాగి సూర్యనారాయణరాజు. ఇతనికి 23,574 ఓట్లు రాగా మరొకరు ముత్యాల పోతురాజు 21,346 ఓట్లు సంపాదించారు. ఎలమంచిలి నియోజకవర్గం నుంచి చింతలపాటి వెంకట సూర్యనారాయణరాజు 13,621 ఓట్లు తెచ్చుకుని గెలవగా, సీపీఐ అభ్యర్థి కాండ్రేగుల రామజోగి 9,961 ఓట్లు మాత్రమే సాధించగలిగారు. చోడవరం నియోజకవర్గంలో ఇండిపెండెంటు రెడ్డి జగన్నాథం 12,658 ఓట్లు సాధించగా, కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థి బోజంకి గంగయ్యనాయుడు 11,796 ఓట్లకు పరిమితమయ్యారు. కణితి నియోజకవర్గంలో ఇండిపెండెంట్ బీజీఎంఏ నరసింగరావు 10,171 ఓట్లు సంపాదించగా, సీపీఐ అభ్యర్థి పోతిన సన్యాసిరావుకు 6,233 ఓట్లు వచ్చాయి. విశాఖపట్నం నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నాయకులు ఎవరూ సరైన ఓట్లు సంపాదించలేకపోయారు. ఇండిపెండెంటు అంకితం వెంకట భానోజీరావు 15,457 ఓట్లు, మరో స్వతంత్ర అభ్యర్థి మద్దిపాటి అభిరామరెడ్డి 6,955 ఓట్లు సాధించారు. కాగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ కి రాష్ట్రంలో 119 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా విశాఖజిల్లాలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోవడం విచిత్రంగా చెప్పుకుంటారు.

● భీమునిపట్నం (రూరల్)

ఐదు ఎన్నికలకు అయిన ఖర్చు

రూ. 23.2 లక్షలే..

- ఇప్పుడు పరిస్థితి మారిపోయింది
- ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరుగుతోంది
- ఓటర్ల ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది
- అప్పట్లో గ్రామానికి ఏం చేస్తారని అడిగేవారు
- ఇప్పుడు వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట
- నిత్యం ప్రజల్లో ఉండడం వల్లే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక కాగలిగా...
- తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లలో స్కూటర్ కూడా లేదు



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావు

నాటికీ, నేటికీ ఓటర్ల ఆలోచనల్లో బాగా మార్పు వచ్చిందని, గ్రామాభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనానికే అత్యధికులు ప్రాధాన్యం ఇస్తున్నారంటున్నారు సీనియర్ రాజకీయ నాయకుడు పప్పల చలపతిరావు అన్నారు. రాను రాను ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. ఎలాంటి వ్యాపారాలు, వ్యాపకాలు పెట్టుకోకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం వల్లే తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక కాగలిగానన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి...అంటే దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న చలపతిరావు తెలుగుదేశం పార్టీ తరపున నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇంకా టీటీడీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా కూడా పనిచేశారు. ఆయన ప్రస్తుతం కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో సౌమ్యునిగా, వివాదరహితునిగా పేరున్న చలపతిరావు ఎలమంచిలిలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో విశేషాలను వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

నాడు పార్టీలో స్వచ్ఛందంగా చేరాను

నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో 1984 స్వచ్ఛందంగా చేరాను. పార్టీలో చేరడానికి ముందు రాంబిల్లి మండలం మురకాడ గ్రామ మునసబుగా, దిమిలి ఎల్ఎస్‌సీఎస్ (లార్జ్ సైజ్డ్ కో-ఆపరేటివ్ సొసైటీ) అధ్యక్షునిగా రెండుసార్లు గెలిచాను. 1984లో ఎన్టీఆర్ గ్రామ మునసబు వ్యవస్థను రద్దు చేయడంతో ఆ ఉద్యోగం కూడా పోయింది. మాది రాజకీయంగా గుర్తింపు ఉన్న కుటుంబం. మా పెదనాన్న పప్పల బాపునాయుడు 1952లో నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా కేఎల్‌పీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1976లో మా మామయ్య నగిరెడ్డి సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

టికెట్ వస్తుందని అనుకోలేదు

1985లో నాదెండ్ల భాస్కరరావు వల్ల ఏర్పడిన సంక్షోభంలో ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పెద్ద నాయకులంతా టీడీపీని వీడారు. అప్పటికి నేను నాయకుడిని కాదు. ఆ సమయంలో ప్రజలంతా ఎన్టీఆర్ వైపుఉన్నారు. గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించే వాళ్లం. ఎలమంచిలి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఎన్టీఆర్‌కు మద్దతుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టాం. మాతోపాటే స్వర్గీయ ఆడారి తులసీరావు పనిచేశారు. సంక్షోభం ముగిసి మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఆడారి తులసీరావు ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతకుముందు ఒకసారి అనుకోకుండా హైదరాబాద్ వెళ్లాను. అక్కడ ఎన్టీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిసి వెళ్లాను. ఆశావహులతో చాంతాడంత క్యూ ఉంది. ఆ క్యూలో ఫైలు పట్టుకుని నేనూ నిల్చున్నాను. అర్ధగంట తరువాత నాకు అవకాశం వచ్చింది. ఇంటర్వ్యూ గదిలోకి వెళ్లాను. సోఫాలో ఎన్టీఆర్ కూర్చున్నారు. ఇద్దరు పీఏలు ఆయన వెనుక నిల్చుని ఉన్నారు. ఎన్టీఆర్ నన్ను పట్టించుకోలేదు. కొద్ది నిమిషాలు తర్వాత నేను ఎదురుగా ఉన్న మరొక సోఫాలో కూర్చున్నాను. దీంతో ఎన్టీఆర్ ఏం? అన్నారు. లేచి నిలబడిన నేను ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని తెలుసుకుని వచ్చానన్నాను. నేను టికెట్ కోసం రాలేదు...మీకో చిన్న సూచన చేద్దామని వచ్చాను అని అనగానే ఎన్టీఆర్ కోపంగా నా వైపు చూశారు. లోలోపల భయం వేసింది అయినప్పటికీ ధైర్యం చేసుకుని టికెట్ల కేటాయింపులో నియోజకవర్గాల్లో బలమైన సామాజిక వర్గాల అభ్యర్థులను ఎంపిక చేస్తే అన్ని స్థానాల్లోనూ మంచి మెజారిటీ వస్తుందని సూచించా. సరే చూద్దాం...అన్నారు. నేను బయటకు వచ్చేశాను. పీఏ నన్ను మళ్లీ లోపలకు పిలిచారు. 'నీ పేరేంటి' అని ఎన్టీఆర్ అడిగి చిరునామా రాసుకున్నారు. మీ నియోజకవర్గంలో ఏ సామాజికవర్గం ఎక్కువ అని అడిగారు. వివరాలు చెప్పాను. నా సామాజిక వర్గం అడిగారు చెప్పాను. మా నియోజకవర్గంలో ఎంక్వయిరీ చేసుకుని ఎవరికి టికెట్ కేటాయించినా మంచి ఫలితాలు ఉంటాయన్నాను. తరువాత ఎన్నికలు దగ్గరకొచ్చాయి. టికెట్ కేటాయింపులు జోరందుకున్నాయి. ఆడారి తులసీరావుకు మద్దతుగా మేం కూడా హైదరాబాద్‌కు వెళ్లాం. అయితే అనూహ్యంగా ఎలమంచిలి టికెట్ నాకు ఇచ్చారు.

అద్దె కారులో ప్రచారం

సీటు రావడంతో ఒక అంబాసిడర్ కారును అద్దెకు తీసుకుని నెల రోజులు పాటు ఎన్నికల ప్రచారం చేశా. ఓటర్లకు డబ్బు, మద్యం, వంటివి ఏమీ పంపిణీ చేయలేదు. మొత్తం ఆ ఎన్నిక ఖర్చు 1.9 లక్షలు. తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లు నాకు స్కూటర్ కూడా లేదు. ఎవరైనా పనుల కోసం వచ్చేవారు నన్ను స్కూటర్‌పై తీసుకువెళ్లేవారు. 1989లో కూడా పార్టీ టికెట్ నాకే వచ్చింది అప్పుడు స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు దాదాపు నాలుగు లక్షల రూపాయలు వరకూ కానుకలుగా ఇచ్చారు. దానిలో 3.2 లక్షలు ఎన్నికల్లో ఖర్చయ్యాయి మిగిలిన డబ్బుతో ఒక సెకండ్ హ్యాండ్ మారుతీ కారు కొనుక్కున్నాను. 1994లోనూ నాకే సీటు రావడంతో పోటీ చేశాను. ఆ ఎన్నికల్లో 3 లక్షల రూపాయలు, తరువాత 1999 నాటి ఎన్నికల్లో సుమారు 3 లక్షల రూపాయలు ఎన్నికలకు ఖర్చయ్యాయి. 2004లో ఎంపీగా సీటు రావడంతో పోటీ చేసి గెలుపొందాను. ఈ ఎన్నికల్లో సుమారు 12 లక్షల రూపాయలు ఖర్చయింది. ఈ ఐదు ఎన్నికల్లో సుమారు మొత్తం 23 లక్షల 20 వేల రూపాయలు వరకూ ఖర్చయింది. తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గానూ, పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా, దేవ దేవుడు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా దేవునికి సేవ చేసుకునే అవకాశం లభించడం నా పూర్వ జన్మసుకృతం. తరువాత ఎమ్మెల్సీగా ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం వచ్చింది.

ఓటర్లలో మార్పు వచ్చింది...వ్యక్తిగత విమర్శలు పెరిగాయి

ఓటర్ల మనోగతంలో మార్పు వచ్చింది. గతంలో అయితే మా గ్రామానికి ఏం చేస్తారు, ఏ విధంగా అభివృద్ధి చేస్తారు అనేవారు. వ్యక్తిగత ప్రయోజనాలకు తావు ఉండేది కాదు. అలాగే అప్పటి ఎన్నికల్లో వ్యక్తిగత విమర్శలు ఉండేవి కావు. నైతిక విలువలు, సిద్ధాంతాలతో ముందుకు సాగేవాళ్లం. ఇప్పుడు డబ్బు ప్రాధాన్యం పెరిగిపోయింది. ఎన్నికల్లో పోటీ చేసే వారు ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెట్టగలరనేది ప్రామాణికంగా మారింది.

కూటమి పార్టీల్లో చేరేందుకు ఉత్సాహంగా..

రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరేందుకు ప్రస్తుతం యువతతోపాటు అన్నివర్గాల ప్రజలు చాలా ఉత్సాహంగా ముందుకువస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో 'కూటమి' అభ్యర్థుల విజయం ఖాయం.

● ఎలమంచిలి